


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 14.09.2025 | సంపుటి : 2 | సంచిక :222 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Sunday | 14.09.2025 | volume : 2 | Issue : 222 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## జీఎస్టీ సంస్కరణలతో

క్యాన్సర్ మందుల ధరలు తగ్గుదలతో ఊరట

# ఔషధాల ధరలు తగ్గింపు

- కార్లు, బైకుల ధరలు కూడా తగ్గిస్తూ ప్రకటనలు
- 22 తర్వాత సిమెంట్, నిర్మాణ సామాగ్రి ధరలు తగ్గుదల
- భారత ఆర్థికవ్యవస్థ 7.8 శాతం వృద్ధిని సాధించిందన్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 : తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని... సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్, నిర్మాణ సామాగ్రి కూడా చౌకగా మారుతాయని ప్రధాని తెలిపారు. వివిధ హెూటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ విధంగా దేశంలోని అనేక కుటుంబాలపై భారం తగ్గించామని వ్యాఖ్యానించారు. 2025-26 మొదటి త్రైమాసికం లో భారత ఆర్థికవ్యవస్థ 7.8 శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

మిగతా 2 లో





## సొంతింటి కలను కాపాడేందుకు ఫండ్

మధ్యతరగతి ప్రజల సొంతింటి కల

సాకారానికి నిధిని ఏర్పాటు చేయండి

సుప్రీం ధర్మాసనం సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 : పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది.

మిగతా 4 లో



## కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించాల్సిందే

తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను రాబట్టాల్సిందే

కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించాలి

న్యాయనిపుణులు, అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 13 : కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి న్యాయనిపుణులు మరియు ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణా నదిలో నికర జలాలైనా, మిగులు జలాలై నా, వరద జలాలైనా సరే... తెలంగాణాకు చెందాల్సిన నీటి వాటాలో ఒక్క చుక్క నీరూ వదులుకునేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను సాధించేందుకు పట్టుబట్టాలని ఆదేశించారు. శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.

- మిగతా 2వ పేజీలో

## గ్రూప్ 1 అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

2లక్షల ఉద్యోగాల హామీని విస్మరించిన రేవంత్

అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ ఏం మాట్లాడారు

నిరుద్యోగుల పక్షాన అసెంబ్లీలో పోరాడుతాం

నిరుద్యోగ మేళాలో ఎమ్మెల్యే హరీష్ రావు

03



సిద్ధిపేట, సెప్టెంబర్ 13 : గ్రూప్-1 పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. రాహుల్ గాంధీని అశోక్‌నగర్‌లో కూర్చోబెట్టి హామీ ఇచ్చారని, ఆ హామీ మోసంగా మారిందని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని, అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని, వారికి న్యాయం జరిగే వరకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సిద్ధిపేటలో జరిగిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు.



03

## 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయ్

గద్వాల గర్జన బహిరంగ సభలో కేటీఆర్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 8 లక్షల ఎక రాలకు నీళ్లిచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ ఆర్ అన్నారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం దాదాపు పూర్తి చేసిందని, అలాంటి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని విమ ర్శించారు. జోగులాంబ జిల్లా గద్వాలలోని తేరు మైదానంలో నిర్వహించిన 'గద్వాల గర్జన' బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు.



## ఎక్సైజ్ సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించాలి

- అవసరమైతే వారికి ఆయుధాలు కూడా ఇస్తాం
- అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి

03



## హైదరాబాద్ మెట్రోలో యువకుడి అసభ్యత

వైరల్‌గా మారిన సోషల్ మీడియా వీడియో

03



## శంకర్‌పల్లి దారి దోపిడీ కేసు

ప్రధాన సూత్రధారి వ్యాపారి కారు డ్రైవరే

- కేసును ఛేదించిన పోలీసులు
- ఏడుగురు నిందితుల అరెస్ట్

04

శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారి దోపిడీని పోలీసులు ఛేదించారు. కారులో వెళుతున్న వ్యాపారిని అడ్డగించి దోచుకున్న కేసులో పోలీసులు వెంటనే దుండగులను పట్టుకోగలిగారు. దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు.

## యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ రూపొందించాలి

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్




హైదరాబాద్, సెప్టెంబరు 13 : యూపీఎస్సీ తరహాలో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కూడా జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి ప్రతి ఏడాది పరీక్షలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగకముందే నోటిఫికేషన్ల విషయంలో స్పష్టత ఇవ్వాలని ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆయన కోరారు. వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్ అశోక్ నగర్ లైబ్రరీ వద్ద, అఫ్జల్‌గంజ్ లైబ్రరీ వద్ద, ఇంకా వివిధ ఇన్‌స్టిట్యూట్స్ వద్ద రాత్రింబవళ్ళు చదువుతూ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని ఆయన తెలిపారు.

- మిగతా 3వ పేజీలో

## వనదుర్గ ఆలయానికి వరదపోటు

మరోమారు ఆలయం మూసివేత

03






02

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఎందుకు మాట్లాడాలి?

కేటీఆర్ విమర్శలపై మండిపడ్డ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్



02

## కుమ్రం భీమ్ జిల్లాలో విషాదం

కుంటలో పడి తల్లీ ముగ్గురు పిల్లల దుర్మరణం

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఎందుకు మాట్లాడాలి?

### కేటీఆర్ విమర్శలపై మండిపడ్డ పీసీసీ చీఫ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :** ఓటు చోరీ గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో నిరూపించారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా దీనిపై ఉద్యమిస్తున్న వేళ, రాహుల్‌కు మద్దతు పెరిగిందని చెప్పారు. మోదీ ఈ విషయంలో అడ్డంగా దొరికారని వ్యాఖ్యానించారు. ఓ జాతీయ అంశంపై పోరాటం చేస్తుంటే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గురించి రాహుల్ ఎందుకు మాట్లాడాలని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ... లిలి"కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించినా కేంద్రంలో ఎందుకు కదలిక లేదు?"లిలి అని ప్రశ్నించారు. ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జైలు ఖాయం అని అన్నారు. ఢిల్లీలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హరీష్ రావు, కేటీఆర్, నరేంద్ర మోదీని కలిసారని తెలియజేశారు. వాళ్లు బీజేపీలో చేరినట్లయితే, తాము కూడా నోటీసులు పంపిస్తామని చెప్పారు. "సీఎంగా రేవంత్ రెడ్డిని అందరూ కలుస్తున్నారు," అని మహేష్ పేర్కొన్నారు. ఫిరాయింపులపై రాహుల్ స్పందించాలని కేటీఆర్ అంటున్నారని చెప్పారు. "రాహుల్ గాంధీపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు ఉందా?" అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణను తప్పించుకోవడానికే ఉపరాష్ట్రపతి ఎన్నికకు బీఆర్ఎస్ దూరంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## బోధన్ ఎస్‌బిఐలో క్యాష్ చోరీ

### సిసి పుటేజీ ఆధారంగా బాలుడు చేసినట్లు గుర్తింపు

**నిజామాబాద్, సెప్టెంబరు 13 :** చిన్న పిల్లలను ఉపయోగించుకుని నేరాలు చేయించే వ్యక్తులను మనం సినిమాల్లో చూస్తుంటాం. చిన్న పిల్లలకు ఒక పని అప్పజెప్పి వెనకాల నుంచి గమనిస్తూ ఉంటారు కేటుగాళ్లు. దీనిలో అసలు విషయం ఏంటంటే.. ఆ బాలుడు నేరం చేసేటప్పుడు దొరికిపోయినా గమనిస్తున్న వాడు మాత్రం పరార్ అయిపోవచ్చు. ఒకవేళ బాలుడే పట్టుబడి మైనర్ అయితే.. జైలు శిక్షకు బదులుగా జ్యువైనల్ హోమ్‌కి పంపిస్తారనే విషయం నిందితులకు బాగా తెలుసు. ఇదే అదునుగా చిన్నారులతో నేరాలు చేయించే అనేక సీన్లు సినిమాల్లో దర్శనమిస్తుంటాయి. తాజాగా అలాంటి ఘటనే ఒకటి బోధన్ లో వెలుగు చూసింది. నిజామాబాద్ జిల్లా బోధన్ భారతీయ స్టేట్ బ్యాంకులో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 8వ తేదీన బ్యాంకులో రూ.5లక్షలు చోరీకి గురైనట్లు– బ్యాంక్ అధికారి నాగనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. ఓ 12 ఏళ్ల బాలుడు క్యాష్ కౌంటర్ వైపు వెళ్లి చోరీ చేసినట్లు– గుర్తించారు. బాలుడు చోరీ చేసే సమయంలో మరో ఇద్దరు అతనికి సహకరించినట్లు– పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. అన్ని కోణాల్లో విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని వెల్లడించారు.



## యూరియా బాధలు పట్టించుకోని రేవంత్ సర్కార్

### మండిపడ్డ మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్, సెప్టెంబరు 13 :** రైతులు యూరియా కోసం విపరీతమైన ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దీనిపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వరి పొట్ట దశలో ఉంది. వారం రోజుల్లో యూరియా రాకపోతే రైతుల దిగుబడి తీవ్రంగా పడిపోతుంది. రైతు ప్రభుత్వం అంటూనే రైతులను ముంచుతున్నారని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి మాటలు బుడ్డ ర్ ఖాన్ మాటల్లా ఉన్నాయి. అబద్ధపు హామీలే తప్ప రైతులకు ఎలాంటి సహాయం చేయడం లేదు. కేసీఆర్, కేటీఆర్‌లను జైలుకు పంపించాలన్న ఆలోచన తప్ప రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా ఆయన విమర్శలు చేశారు. రెండు లక్షల 20 వేల కోట్ల అప్పులు చేసి రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా పూడ్చలేదు. నాలుగు లక్షల కోట్లతో ఎక్కడైనా ఒక్క ప్రాజెక్ట్ కట్టావా? ఒక బ్రిడ్జ్ అయినా కట్టావా? అని ప్రశ్నించారు. రైతులకు వెంటనే యూరియా సరఫరా చేయాలని, లేకుంటే రైతులతో పాటు– మహిళలను తీసుకుని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. 'కబర్దార్... ఇక మౌనంగా ఉండం' అని ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.



## రేణు అగర్వాల్ హత్య కేసులో పురోగతి

- ఇద్దరు నిందితులను పట్టుకున్న పోలీసులు
- పనికి పెట్టుకునే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్న కమిషనర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :** నగరంలో సంచలనం సృష్టించిన కూకట్‌పల్లిలో రేణు అగర్వాల్ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు– పోలీసులు తెలిపారు. నిందితులను రాంచీలో పట్టుకున్నట్లు– వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి మీడియాకు వివరించారు. హత్య అనంతరం నిందితులు క్యాబ్‌లో రాంచీకి పరారైనట్లు చెప్పారు. హాఫీజ్‌పేట నుంచి సికింద్రాబాద్ వెళ్లి అక్కడి నుంచి రైలులో రాంచీకి వెళ్దామనుకున్నారనీ.. అయితే అక్కడ పోలీసుల కదిలికలు చూసి క్యాబ్ తీసుకుని పరారయ్యారని వివరించారు. ఈ హత్యక్రమంలో సిపి పలు సూచనలు చేశారు. ఇంట్లో ఎవరినైనా ఇంట్లో పనికి పెట్టుకునే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సూచించారు. వారి నేపథ్యం గురించి ఆరా తీయాలని పేర్కొన్నారు. మొత్తం 7 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారని చెప్పారు. రోల్డ్ గోల్డ్ నగలు చూసి ఇంట్లో భారీగా బంగారం ఉందని నిందితులు భావించారని తెలిపారు. కూకట్‌పల్లిలో రేణు అగర్వాల్ దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్న యువకుడు.. మరొకరు కలిసి ఆమెను చేతులు, కాళ్లు తాళ్లతో కట్టేసి.. చిత్రహింసలు పెడుతూ.. తలపై కుక్కర్‌తో కొట్టి హత్య చేశారు. నగదు, బంగారం దోచుకెళ్లారు. హత్య చేశాక.. అదే ఇంట్లో తాపీగా స్నానం చేసి.. యజమానికి చెందిన ద్విచక్ర వాహనంపైనే పరారయ్యారు. కూకట్‌పల్లిలోని స్వాన్ లేక్ గేటెడ్ కమ్యూనిటీలో బుధవారం సాయంత్రం ఈ దారుణం చోటుచేసుకుంది. దీనిని సవాల్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకున్నారు.

# దేశానికి మణిహారం మణిపూర్

- మణిపూర్‌ను దేశంతో అనుసంధానం చేస్తాం
- రూ.7వేల కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- మణిపూర్ అల్లర్ల బాధితులకు పరామర్శ
- శాంతియుత వాతావరణంతోనే అభివృద్ధి సాధ్యం
- రెండేళ్ల తరవాత మణిపూర్‌లో పర్యటించిన ప్రధాని మోదీ
- మోదీ రాకతో భారీగా భద్రతా ఏర్పాట్లు



**ఇంఫాల్, సెప్టెంబర్ 13 :** మణిపూర్ పేరులోనే మణి ఉందని, అది దేశానికే మణివంటిదని, మణిపూర్ దేశానికి ప్రకృతి ఇచ్చిన బహుమతి అని ప్రధాని మోదీ కొనియాడారు. మణిపూర్‌ను వేగంగా ప్రగతి పథంలో పయనింపజేస్తామని, మణిపూర్ కోసం రూ.7 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. మణిపూర్‌ను దేశంతో అనుసంధానం చేసే ప్రాజెక్టులు చేపడుతున్నామని, రైలు, రోడ్డు మార్గాల కోసం మణిపూర్‌కు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. భారీ వర్షాల వల్ల హెలికాప్టర్‌లో రావడం సాధ్యపడలేదని నరేంద్ర మోదీ తెలిపారు. రోడ్డు మార్గంలో మణిపూర్‌కు వచ్చానని చెప్పారు. చాలాకాలం తరవాత మణిపూర్‌లో మోదీ పర్యటించారు. మణిపూర్‌లో అల్లర్ల బాధితులను పరామర్శించారు. ఇంఫాల్, చురాచంద్‌పూర్‌లో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మణిపూర్‌లో అల్లర్ల బాధిత కుటుంబాల చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మణిపూర్ బహిరంగ సభలో మాట్లాడారు. రోడ్డు మార్గంలో వచ్చేటప్పుడు తమరు పలికిన స్వాగతం మర్చిపోలేనని, మువ్వన్నెల జెండాలు చేతబట్టి తనకు ఘనంగా స్వాగతం పలికారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రూ.8 వేల కోట్లతో జాతీయ రహదారుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మణిపూర్‌లో రైలు కనెక్టివిటీ భారీగా పెంచుతున్నామని మోదీ పేర్కొన్నారు.

### త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతుందని చెప్పారు. ప్రస్తుతం మణిపూర్ చేపడుతున్న ప్రాజెక్టులతో మౌలిక సదుపాయాలు, వైద్యసేవలు మెరుగవుతాయని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అనేక వివాదాలు, ఉద్యమాలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంటోందని, శాంతి స్థాపన ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. శాంతి స్థాపన ద్వారా తమ భావితరాల భవిష్యత్తు బావుంటుందని, మణిపూర్ ప్రజల వెంట భారత ప్రభుత్వం ఉందని మోదీ స్పష్టం చేశారు. జాతుల మధ్య ఘర్షణలకు కేంద్రమైన చురాచంద్‌పూర్ జిల్లాకు చేరుకున్నారు. అక్కడ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. హింసాత్మక ఘటనల వల్ల నిరాశ్రయులైన వారితో మాట్లాడారు. 2023లో ఈ ఘర్షణలు చోటుచేసుకోగా, రెండేళ్ల తర్వాత మోదీ ఆ రాష్ట్రానికి వెళ్లారు. శరణార్థి శిబిరాల్లో ఉన్న చిన్నారులను పలకరించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఓ చిన్నారి కానుకగా ఇచ్చింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని వారికి హామీ ఇచ్చారు. తర్వాత స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

### ప్రకృతి కానుక మణిపూర్

"మణిపూర్ ప్రకృతి ప్రసాదించిన కానుక. రాష్ట్ర ప్రజలకు తల వంచి నమస్కరిస్తున్నాను. ఇది సాహసవంతులు పుట్టిన నేల. మణిపూర్‌లో కొండలు చాలా అందంగా ఉన్నాయి. పేరులో ఉన్న మణికి అర్థం – ఈశాన్య రత్నమని. ఈ రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తాం. ఇలాంటి అందమైన ప్రాంతంలో హింస చెలరేగింది. కొత్త ఉషస్సు ప్రారంభం కానుంది. ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకున్నారు. శాంతి చర్చలు మొదలయ్యాయి. నేను మీతో ఉన్నాను. కేంద్రం మీ వెంటే ఉందని హామీ ఇస్తున్నాను. ఈ రాష్ట్రం శాంతికి చిహ్నంగా మారాలని కోరుకుంటున్నాను," అని మోదీ అన్నారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా సభకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. మెయిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనపై వచ్చిన వ్యతిరేకత 2023లో మణిపూర్‌ను హింసాత్మకంగా మార్చిన సంగతి తెలిసిందే. వారికి రిజర్వేషన్లు ఇవ్వొద్దని ఆదివాసీ తెగలు డిమాండ్ చేశాయి. మెయిటీలకు రిజర్వేషన్లు దక్కితే వారు తమ అటవీ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు, తమకు రావాల్సిన ఉద్యోగాల్లో వాటా తగ్గిపోతుందని వారు ఆందోళన చెందారు. ఆ నిరసనలకు చురాచంద్‌పూర్ కేంద్రమైంది. రాష్ట్రంలోని పలు అటవీ ప్రాంతాలను రిజర్వ్ ప్రాంతాలుగా ప్రకటించడంతో కొండలపై నివాసమున్న వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పునరావాసం కల్పించకుండా తమను తరలించడంపై నిరసన వ్యక్తం చేశారు. దీనికితోడు రిజర్వేషన్ల అంశం తెరపైకి రావడంతో నిరసనలు ఘర్షణ రూపం దాల్చాయి. ఆ క్రమంలో అమానవీయ ఘటనలు చోటుచేసుకున్నాయి. మణిపుర్‌లో చెలరేగిన అల్లర్లలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, కొన్ని వేల మంది నిరాశ్రయులయ్యారు. పలువురి ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ హింసపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న బీరెన్‌సింగ్ ఈ ఏడాది తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత శనివారం మణిపూర్‌కు వెళ్లారు. ఈ పర్యటన దృష్ట్యా మణిపూర్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మిజోరం, మణిపూర్, అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో మోదీ పర్యటన సాగనుంది.

## జీఎస్టీ సంస్కరణలతో ఔషధాల ధరలు తగ్గింపు

### క్యాన్సర్ మందుల ధరలు తగ్గుదలతో ఊరట

- కార్లు, బైకుల ధరలు కూడా తగ్గిస్తూ ప్రకటనలు
- 22 తర్వాత సిమెంట్, నిర్మాణ సామాగ్రి ధరలు తగ్గుదల
- భారత ఆర్థికవ్యవస్థ 7.8 శాతం వృద్ధిని సాధించిందన్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 :** తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని... సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్, నిర్మాణ సామాగ్రి కూడా చౌకగా మారుతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ విధంగా దేశంలోని అనేక కుటుంబాలపై భారం తగ్గించామని వ్యాఖ్యానించారు. 2025–26 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8 శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశం చేసే ఎగుమతుల్లో వృద్ధిని సాధించగలిగామని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని మండిపడ్డారు. 2014కి ముందు టూత్‌పేస్ట్, సబ్బు, నూనె వంటి రోజువారీ నిత్యావసర వస్తువులకు కూడా 27 శాతం పన్ను విధించేవారని గుర్తు చేశారు. నేడు వీటిపై కేవలం 5 శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించడం వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ చాలా ఖరీదైనదిగా మారిందని అన్నారు. మన ఆర్థికవ్యవస్థలో తయారీ రంగ వృద్ధి మన జాతీయ భద్రతకు చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్న వారికి భారత సైన్యం ఎలా బుద్ధి చెప్పిందో ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ తెలిపారు. మన సాయుధ దళాలు చూపిన తెగువకు దేశం మొత్తం గర్వపడిందన్నారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ ఆయుధాలే మన దేశాన్ని రక్షించడంలో ముఖ్య పాత్ర పోషించాయని చెప్పారు. మణిపుర్‌లో జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ఆ రాష్ట్రంలో నేడు పర్యటించనున్నారు. దీనికి ముందు మిజోరంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బైరాబి–సైరాంగ్ రైల్వే లైన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మిజోరం నుంచి చురాచంద్‌పుర్‌కు చేరుకుంటారు.

## దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకం

- యువత ఇందులో భాగస్వామ్యం కావాలి
- మిజోరంలో రూ.9వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు
- ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

**గ్యాంగ్‌టక్, సెప్టెంబరు 13 :** దేశాభివృద్ధిలో మిజోరం భాగ స్వామ్యం కీలకమని ప్రధాని మోడీ తెలిపారు. కొండమార్గంలో రైలు మార్గం కష్టతరంలో కూడుకు న్నదని, సవాల్ తో కూడిన నిర్మాణాలు అద్భుతమని కొనియాడారు. మిజోరంలో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. వర్చువల్‌గా అభివృద్ధి పనులను పిఎం మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈ రైల్వే లైన్లు భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమవుతాయని, పర్యాటక రంగం తో ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని తెలియజేశారు. ఏ రాష్ట్రాభివృద్ధికైనా రోడ్డు, రైల్వే, పోరు కనెక్టివిటీ ముఖ్యమని స్పష్టం చేశారు. మిజోరం అభివృద్ధి కి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, వేగవంతమైన దేశాభివృద్ధిలో మిజోరం యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మిజోరంలో రవాణా సౌకర్యాలు పెంచామని, నూతన రైళ్ల ప్రారంభోత్సవంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని మోడీ వివరించారు. కష్టతరమైన కొండ ప్రాంతాల్లో రైల్వే సౌకర్యం సంతోషకరమైన విషయమన్నారు. ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల స్ఫూర్తి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిందని ప్రశంసించారు. కఠినమైన భూభాగంతో అనేక సవాళ్లను అధిగమించి నిర్మాణం పూర్తి చేశారని మోడీ కొనియాడారు.

## పాడుబడ్డ పాఠశాలలో మత్తుపదార్థాల తయారీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :** మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు– చేసిన ఈగల్ టీమ్ మరో భారీ మత్తు పదార్థాల రాకెట్ గుట్టును రట్టు చేసింది. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో మత్తు పదార్థాల తయారీ కేంద్రంపై దాడి చేసింది. పాత పాఠశాల భవనంలో ఆల్ఫాజోలం అనే మత్తు పదార్థాన్ని తయారు చేస్తున్న ముఠాను ఈగల్ టీమ్ పట్టుకుంది. మత్తు మందు తరలిస్తుండగా.. నలుగురు సభ్యులతో కూడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పాఠశాల నుంచే వీరంతా దందా కొనసాగిస్తు న్నారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో రూ.కోటి విలువైన 7 కిలోల అల్ఫాజోలం, అల్ఫాజోలం తయారు చేసే యంత్రాలు, ముడి సరకును స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు– రూ.20 లక్షల నగదు, కల్లులో కలిపే పౌడర్‌ని కూడా సీజ్ చేశారు.

## కుమ్రం భీమ్ జిల్లాలో విషాదం

### కుంటలో పడి తల్లీ ముగ్గురు పిల్లల దుర్మరణం

**కొమురంభీం, సెప్టెంబర్ 13 :** వాంకిడి మండలం డాబా గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ నీటిగుంతలో పడి తల్లి, ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతి చెందిన వారిని మోర్లే బుజ్జి బాయి (35), మోర్లే గన్ను(12), వాడే మహేశ్వరీ(9), అదే శశిక(9)గా గుర్తించారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మోర్లే బుజ్జి బాయి అనే మహిళ పొలం వద్ద పనిచేస్తున్న సమయంలో నీటి కోసం ముగ్గురు పిల్లలు కుంటలో దిగారు. కుంటలో లోతు ఎక్కువగా ఉండటంతో.. చిన్నారులు నీటిలో మునిగిపోయారు. అది గమనించిన మహిళ చిన్నారులను రక్షించేందుకు నీటిగుంతలోకి దిగింది. గుంతలో నీరు, బురద ఎక్కువగా ఉండటంతో నలుగురు నీటిగుంతలోనే చిక్కుకుని మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ కె. వోహ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇ.ఎన్.సి. అంజద్ హుస్సేన్, సీఎంవో సెక్రటరీ మాణిక్ రాజ్, ఇతర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి న్యాయనిపుణులకు పలు సూచనలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉంచి, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలను ట్రిబ్యునల్‌కు అందించాలన్నారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించడంలో విఫలమయ్యిందని, పైగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలను కట్టబెట్టి, తెలంగాణకు కేవలం 299 టీఎంసీల వాటాతో ఒప్పించడమే, తీవ్ర అన్యాయం జరిగిందని చర్చలో చెప్పారు. అప్పటి సీఎం కేసీఆర్ 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయం ఇప్పుడు ఏపీ ట్రిబ్యునల్ ముందు ఉంచినట్టు న్యాయనిపుణులు సీఎంకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని సీఎం అన్నారు. గత పదేళ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటా సాధించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పాలమూరు నుంచి డిండిగీ వరకు తలపెట్టిన ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో పడేశారని ఆరోపించారు. నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం జరిగిందన్నారు. దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ కూడా న్యాయ సూత్రాల ప్రకారం జరగాల్సి ఉందని, కొత్తగా ఏర్పడిన తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటా రావాల్సినదే అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోతున్నదని, ఈ విషయాన్ని ట్రిబ్యునల్ ముందు ఉంచాలని సీఎం అధికారులను ఆదేశించారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రోజూ 10 టీఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తూ ఇతర బేసిన్లకు తరలిస్తోందన్నారు. ఎక్కడ పడితే అక్కడ కాలువల సామర్థ్యం పెంచుకోవడంతో పాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు నీటిని అక్రమంగా తరలిస్తున్న అంశాలను ఆధారాలతో సహా ట్రిబ్యునల్‌కు నివేదించాలని సీఎం స్పష్టం చేశారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించడం వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్‌తో పాటు పులిచింతల వద్ద ఉన్న జలవిద్యుత్ ప్రాజెక్టులకు తీవ్ర ప్రమాదం ఉందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జలవిద్యుత్ కు విఘాతం కలుగుతోందని తెలిపారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్ ఎదుట వాదనలుగా వినిపించాలని సీఎం ఆదేశించారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంగా తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునే అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు. సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప మరొక మార్గం లేదని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఇప్పటివరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లే కృష్ణా జలాలను వినియోగించుకోలేకపోయామని గుర్తు చేశారు. తెలంగాణ తరపున వాదన వినిపించేందుకు ఇదే సరైన అవకాశం అని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును నిర్ణయించే ఈ వాదనలు ఎంతో కీలకమని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదని న్యాయనిపుణులకు సూచించారు.

# గ్రూప్-1 అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో
# విచారణ జరిపించాలి

- 2 లక్షల ఉద్యోగాల హామీని విస్మరించిన రేవంత్
- అశోక్‌నగర్ చౌరస్తాలో రాహుల్ ఏం మాట్లాడారు?
- నిరుద్యోగుల పక్షాన అసెంబ్లీలో పోరాడతాం
- నిరుద్యోగ మేళాలో ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్ధిపేట, సెప్టెంబర్ 13 :** గ్రూప్-1 పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. రాహుల్ గాంధీని అశోక్‌నగర్‌లో కూర్చోబెట్టి హామీ ఇచ్చారని, ఆ హామీ మోసంగా మారిందని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని, అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని, వారికి న్యాయం జరిగే వరకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సిద్ధిపేటలో జరిగిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రూప్-1లో ఉద్యోగాల కోసం మంత్రులు, అధికారులు లక్షల రూపాయల లంచం అడిగారని చెబుతున్నారని మండిపడ్డారు. తప్పును సరిదిద్దుకోకుండా మరోసారి అప్పీల్‌కి వెళ్లాలని ప్రభుత్వం భావించడం సిగ్గుచేటన్నారు. "పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చు," అని హరీష్ తెలిపారు. "చాలామంది ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చూస్తారు, అది తప్పు కాదు. కానీ జీవితంలో మొదటి అడుగు చాలా ముఖ్యం. సిద్ధిపేట దాటి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తే అనుభవం వస్తుంది. ఉద్యోగం కోసం ఊరు దాటి వెళ్తే ప్రపంచాన్ని అర్థం చేసుకునే అవకాషం వస్తుంది," అన్నారు. "పోటీ ప్రపంచంలో నువ్వెక్కడ ఉన్నావు, ఎక్కడ నిలబడావు, ముందుకు సాగాలంటే ఏం చేయాలో అర్థం చేసుకుంటారు. కష్టం విలువ, డబ్బు విలువ తెలుస్తుంది. ఉన్నత ఉద్యోగం రావడం వరకూ ప్రయత్నించాలి. కానీ మధ్యలో లభించే అవకాశాలను కూడా వదులుకోకూడదు," అని యువతకు సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. గ్రూప్-1 పరీక్ష జరగగానే నిరుద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మంత్రులు, అధికారులు లక్షలు అడిగారని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారని గుర్తు చేశారు. హైకోర్టు కూడా ప్రభుత్వంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిందన్నారు. "నిజంగా తప్పు చేయకపోతే, ముఖ్యమంత్రి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. అవినీతికి పాల్పడిన వారిని శిక్షించాలి. మరోసారి అప్పీల్‌కి పోదామని చెప్పడం మూరత్వం. రెండేళ్లవుతోంది - 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలేమయ్యాయి రేవంత్ రెడ్డి?"లిలి అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "రాహుల్ గాంధీని అశోక్‌నగర్ చౌరస్తాలో కూర్చోబెట్టి మాటిచ్చారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని. ఏమైంది?" అన్నారు.

"ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చింది కేసీఆర్, పరీక్ష నిర్వహించింది కేసీఆర్, ఇంటర్వ్యూలు కూడా కేసీఆర్. కానీ కేవలం నియామక పత్రాలు ఇచ్చిందంతే ు రేవంత్ రెడ్డి. ఇదే మీ పాలన!" అని ఎద్దేవా చేశారు. "అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తే చర్చ పెట్టకుండా, ఒక అంశాన్ని చూపించి 'జాబ్ క్యాలెండర్' అంటూ తప్పించుకున్నారు. అది జాబ్ క్యాలెండర్ కాదు ు జాబ్‌లెస్ క్యాలెండర్!" అని విమర్శించారు. "హుస్నాబాద్ సభలో ప్రియాంకా గాంధీతో చెప్పించారు నిరుద్యోగ భృతి రూ.4000 ఇస్తామని. ఏమైంది? ప్రభుత్వం పూర్తిగా నిరుద్యోగులను మోసం చేసింది. వారి కోసం మేము అసెంబ్లీలో ప్రశ్నిస్తాం, న్యాయం జరిగే వరకూ పోరాడతాం," అని హరీష్ చెప్పారు. వేటర్నరీ కాలేజీని సిద్ధిపేటలో పెడితే, రేవంత్ రెడ్డి దానిని కొడంగల్‌కు తరలించారని అన్నారు. "సిద్ధిపేటకు అన్యాయం చేశారు. 1000 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి 90 శాతం పనులు పూర్తి చేశాం. కానీ ఆ చిన్న పని కూడా పూర్తిచేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది," అన్నారు. "ఈ ప్రభుత్వం పాజిటివ్ దిశలో కాకుండా నెగటివ్ దిశలో ఎక్కువగా సాగుతోంది,"లిలి అని వ్యాఖ్యాని ంచారు. "మరిన్ని జాబ్ మేళాలు యువత కోసం ఏర్పాటు చేస్తాం. లండన్‌కు వెళ్లినప్పుడు కూడా మన ఐటీ టవర్‌లో కంపెనీలు పెట్టాలని అక్కడ ఉన్న తెలంగాణ యువతను కోరాను. దాదాపు 30 కంపెనీలు ఇప్పుడు ఉద్యోగ అవకాశాలతో సిద్ధంగా ఉన్నాయి," అన్నారు.

## యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ రూపొందించాలి

### బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబరు 13 :** యూపీఎస్సీ తరహాలో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కూడా జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి ప్రతి ఏడాది పరీక్షలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగకముందే నోటిఫికేషన్ల విషయంలో స్పష్టత ఇవ్వాలని ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆయన కోరారు. వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్ అశోక్ నగర్ లైబ్రరీ వద్ద, అఫ్జల్‌గంజ్ లైబ్రరీ వద్ద, ఇంకా వివిధ ఇన్‌స్టిట్యూట్స్ వద్ద రాత్రింబవళ్ళు చదువుతూ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని ఆయన తెలిపారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు అన్యాయం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ఆయన విమర్శించారు. "తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం, 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం" అంటూ మాటలు చెప్పడమే తప్ప, నియామకాలకు సంబంధించి లెక్కలు చూపడం లేదని ఆయన విమర్శించారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి, ఆ ప్రకారం నియామకాలు చేపట్టాలని రాంచందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పాలమూరు ఎత్తిపోతలకు
## గండికొడితే ఊరుకోం : నాగం

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13 :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గండి కొట్టి నల్లగొండ జిల్లాకు నీటిని తరలించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగం జనార్దన్ రెడ్డి హెచ్చరించారు. ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేసేందుకు పూనుకుంటే పార్టీలకతీతంగా ఉద్యమిస్తానని హెచ్చరించారు. అందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో పెద్దదిగా ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు అన్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంటు-న్నదని నాగం జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. అలాంటి ప్రయత్నాలు మానుకోకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని నాగం జనార్దన్ రెడ్డి హెచ్చరించారు.

## యూరియా కోసం రైతుల పోరాటం

### బీబీపేటలో పోలీస్ స్టేషన్‌లో టోకెన్ల పంపిణీ

**కామారెడ్డి, సెప్టెంబరు 13 :** కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట శనివారం యూరియా కోసం రైతుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. వందల మంది రైతులు ఒకేసారి పంపిణీ కేంద్రానికి వచ్చారు. వారిని పోలీసులు అదుపు చేయలేకపోయారు. ఒక దశలో పోలీసులపైనా అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి.. పోలీసుల సమక్షంలో టోకెన్లు అందజేశారు. అనంతరం పీఏసీఎస్ వద్ద 930 యూరియా బస్తాలను రైతులకు అందించారు. పోలీస్ స్టేషన్ వద్ద టోకెన్లు తీసుకునే సమయంలో మల్కాపూర్‌కు చెందిన రైతు అంబల్ల చిన్నరేకయ్య ఫిట్స్ వచ్చి పడిపోవడంతో ఆందోళన నెలకొంది. ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఆయన కోలుకున్నట్లు-స్థానికులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు రప్పించి టోకెన్లు ఇవ్వడం ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తేవడానికి తాము పోలీస్ స్టేషన్‌కు రప్పించామని పోలీసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. మెదక్ జిల్లా చేగుంటలోని రైతు వేదిక వద్ద వర్షంలో సైతం అన్నదాతలు బారులు తీరారు. చేగుంట రైతు వేదికకు 1500 వందల యూరియా బస్తాలు వచ్చాయన్న సమాచారంతో రైతులు భారీగా తరలివచ్చారు. తిండీతిప్పలు మాని యూరియా కోసం వస్తే.. ఒకే బస్తా ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్పందించి రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



## కొండా సురేఖ-నాయిని మధ్య
## మళ్లీ విభేదాలు

### ఇద్దరు ధర్మకర్తల నియామకంపై నాయిని ఫిర్యాదు

**వరంగల్, సెప్టెంబర్ 13 :** వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో వర్గ విభేధాలు మళ్లీ ముదురుదుతున్నాయి. భద్రకాళీ ఆలయ పాలకమండలి కమిటీ- విషయంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మధ్య చిచ్చురేగింది. తన నియోజకవర్గంలోని ఆలయంలో తనకు సమాచారం ఇవ్వకుండా ఇద్దరు ధర్మకర్తలను నియమించడంపై ఎమ్మెల్యే మండిపడుతున్నారు. కొండ సురేఖ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఇలాగే కొనసాగితే నష్టం జరుగుతుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా ఆలయ పాలక మండలి సభ్యులను ఎలా నియమిస్తారని అని ప్రశ్నించారు. దేవాదాయ శాఖకు మంత్రి అయినంత మాత్రానా ఏదైనా చేయొచ్చా అని నిలదీశారు. తన నియోజకవర్గంలో మంత్రి పెత్తనం ఏంటని ధ్వజమెత్తారు. మంత్రి కొండా సురేఖ ఇదే పద్ధతి అవలంభిస్తే తాను చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అంతా మంత్రి చేశాక స్థానికంగా తాను ఉన్నది దేనికని, తన ఓపికకు పరీక్ష పెట్టవద్దని హెచ్చరించారు.



## వనదుర్గ ఆలయానికి
## వరదపోటు

### మరోమారు ఆలయం మూసివేత

**మెదక్, సెప్టెంబరు 13 :** జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడు-పాయల వన దుర్గమ్మ ఆలయం వద్ద వరద ప్రవాహం మ-రోసారి పెరిగింది. జిల్లాలో కురిసిన భారీ వర్షానికి మంజీరానదిలో వరద ఉధృతి పెరిగింది. గర్భగుడి ముందు నుంచి వరద ప్రవహిస్తున్నది. దీంతో ఆలయాన్ని మరోసారి అధికారులు మూసివేశారు. ఇటీవలే కురిసిన వర్షాలకు దాదాపు నెల రోజులుగా మూతపడిన ఈ ఆలయం మూడ్రోజుల క్రితమే అమ్మవారి మూలవిరాట్ దర్శనాలు పునః ప్రారంభమయ్యాయి. ఇంతలోనే మరోసారి వరద పెరగడంతో ఆలయాన్ని మూసివేయాల్సి వచ్చింది. శనివారం తెల్లవారుజామున అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. దుర్గామాతకు రాజగోపురంలో పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు రాకుండా కట్టడి విధించారు.

## నగరంలో పలుచోట్ల వర్షం

**హైదరాబాద్, సెప్టెంబరు 13 :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగే పరిస్థితికి చేరుకున్నాయి. నగరంలో కొన్ని గంటల నుంచి నిరంతరాయంగా కురుస్తున్న వర్షంతో రహదారులపై నీరు చేరింది. ఆఫీసు నుంచి ఇళ్లకు వెళ్లే టైం కావడంతో వాహనదారుల ఇక్కట్లు-పడుతున్నారు. రాగల రెండు గంటల్లో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు- వాతావరణ శాఖ హెచ్చరించింది. నగరంలోని సికింద్రాబాద్, బేగంపేట్, రసూల్‌పుర, సోమాజిగూడ, మల్కాజ్‌గిరి, కంటోన్మెంట్, తిరుమలగిరి, అల్వాల్‌లో వర్షం కురుస్తోంది. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ఈ మేరకు నగరవాసులు అప్రమత్తంగా ఉండాలంటూ.. జీహెచ్ఎంసీ హెచ్చరికలు జారీ చేసింది. కాగా, జీహెచ్ఎంసీ, హైడ్రా మాన్సూన్ బృందాలు సహాయక చర్యలకు సిద్ధం అవుతున్నాయి. నగరంలో ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో ఈ వర్షాలు మొదలయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడే అవకా శం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## 10 నియోజకవర్గాల్లో
## ఉప ఎన్నికలు రాబోతున్నాయ్ : కేటీఆర్



**గద్వాల:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో 8 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం దాదాపు పూర్తి చేసిందని, అలాంటి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. జోగులాంబ జిల్లా గద్వాలలోని తేరు మైదానంలో నిర్వహించిన 'గద్వాల గర్జన' బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు. గద్వాలను జిల్లా కేంద్రంగా చేసిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. "రైలు కింద తలపెడతాను కానీ, పార్టీ మారబోనని గతంలో కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఇప్పుడేమో అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నట్లు చెప్పారు. ఆయన పార్టీ మారుతున్నది.. నియోజకవర్గ అభివృద్ధి కోసమా..? సొంత అభివృద్ధి కోసమా? పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల స్థానాల్లో ఉపఎన్నికలు వస్తాయి. పార్టీ ఫిరాయింపులపై సుప్రీం కోర్టు చాలా సీరియస్‌గా ఉంది. సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నా. 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి.. ఎన్నికలకు రావాలి. కాంగ్రెస్ నేతలు యూరియాను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. గ్రూప్-1 ఉద్యోగాలు కూడా అమ్ముకున్నారు. రాష్ట్రం దివాళా తీసిందని సీఎం అంటే..ఎవరైనా అప్పు ఇస్తారా? ఇథనాల్ కంపెనీకి వ్యతిరేక పోరాటంలో భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుంది" అని కేటీఆర్ అన్నారు.



## ఇంటర్ బోర్డు భూముల ఆక్రమణ

### ఆక్రమణలు కూల్చేసిన హైడ్రా

**హైదరాబాద్, సెప్టెంబరు 13 :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధి సర్వే నంబర్ 217లోని 12 ఎకరాల భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా (అధికారులు కూల్చివేశారు. 2011లో ఈ భూములను బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్‌కు ప్రభుత్వం కేటాయించింది. వీటిని ఇటీవల ఓ నిర్మాణ సంస్థ కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టింది. ఈక్రమంలో ఫిర్యాదు అందుకున్న హైడ్రా చర్యలు తీసుకుంది. శనివారం పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది.

## హైదరాబాద్ మెట్రోలో
## యువకుడి అసభ్యత

### వైరల్‌గా మారిన సోషల్ మీడియా వీడియో

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :** హైదరాబాద్ మెట్రోలో ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపుతోంది. రద్దీగా ఉన్న మెట్రో బోగీలో ఓ యువకుడు ఎక్కి, ప్యాంట్ జిప్ తీసి, ఓ యువతిని వెనక నుంచి తాకుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ దృశ్యాలను పక్కనే ఉన్న ఓ ప్రయాణికుడు వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన ఎప్పుడు, ఏ స్టేషన్‌లో జరిగింది అన్న విషయం ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై స్పందించిన నెటిజన్లు, బాధ్యత వహించి ఆ యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "పబ్లిక్ ప్రదేశంలో ఇలాంటి ప్రవర్తన చాలా అవమానకరమైనది," అని పలువురు మండిపడుతున్నారు. ఇలాంటి ఘటనలు విదేశాల్లో జరుగుతాయని భావించేవాళ్లమనీ, ఇప్పుడు భారత్‌లోనూ జరిగే స్థితికి రావడం దారుణమని, ఇది సంస్కృతికి ముప్పుగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి, చట్టాన్ని అమలు చేయడంలో ఉదాసీనంగా ఉండకూడదనిలిలి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



## ఎక్సైజ్ సిబ్బంది సమర్థంగా
## విధులు నిర్వహించాలి

- అవసరమైతే వారికి ఆయుధాలు కూడా ఇస్తాం
- అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :** ఎక్సైజ్ సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించేందుకు అవసరమైతే ఆయుధాలు కూడా ఇస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, నాటు సారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగంపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలు ఉక్కుపాదం మోపాలని ఆయన సూచించారు. ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎక్సైజ్ శాఖ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎస్‌టీఎఫ్ టీంలు మంచిగా పనిచేసే వారికి అవసరమైతే ఆయుధాలు ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని వెల్లడించారు. అందుకు అనుగుణంగా శిక్షణ కల్పించాలని అధికారులను ఆదేశించారు. నల్ల బెల్లం తయారీ, అమ్మకాలు, వినియోగంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ పట్టుకున్న నల్ల బెల్లాన్ని సేంద్రియ ఎరువుల తయారీకి రైతులకు ఇచ్చేందుకు మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ పట్టుబడినప్పుడు వాటిని పగులగొట్టకుండా వినియోగించుకునే అవకాశాలపై పరిశీలన చేయాలన్నారు. వాటిని జాతీయ ఉత్పత్తిగా గుర్తించి అమ్మకాలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి తో పాటు సింథటిక్ డ్రగ్స్ తయారీ, అమ్మకాలు, రవాణా, వినియోగంపై పూర్తి దృష్టి పెట్టాలని మంత్రి తెలిపారు. నాచారం, చర్లపల్లి వంటి ప్రాంతాల్లోని ఇల్లీగల్ పరిశ్రమలపై తనిఖీలకు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఒకే లైసెన్స్‌పై ఒకటి కంటే ఎక్కువ బార్లు నడుపుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, బ్రాండీ షాపుల సిట్టింగ్ టైంలపై నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న రైస్ మిల్లులు, ఇతర ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమీక్షలో రాష్ట్రంలోని కల్తీ మద్యం, డ్రగ్స్, అడల్టరేషన్ వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ప్రజల ఆరోగ్యం కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని, అక్రమ కార్యకలాపాలపై జీరో టాలరెన్స్ విధానంతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. చర్లపల్లి ఘటనపై వస్తున్న వార్తలకు స్పందిస్తూ, అక్కడ 12 వేల కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ పట్టుబడినట్లు వచ్చిన వార్తలు వాస్తవం కాదని, వాస్తవంగా రూ.3 నుండి రూ.4 కోట్లు విలువే ఉండొచ్చని అంచనా వేశామని చెప్పారు.



## కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఔదార్యం

- అంధ బాలుడి కుటుంబానికి అండ
- ఏడున్నర లక్షల చెక్కు అందచేత

**సంగారెడ్డి, సెప్టెంబరు 13 :** సామాజిక సేవా కార్యక్రమాల్లోనే కాదు.. ఉదారతలో సైతం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జయప్రకాశ్ రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి ముందుంటారు. తాజాగా ఆయన మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్న అంధ బాలుడి కుటుంబానికి ఆయన అండగా నిలిచారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం లోంకా తండాకు చెందిన వికాస్ నాయక్ మూడేళ్ల వయస్సులో అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో అతడు కంటి చూపును కోల్పోయాడు. అతడి తల్లిదండ్రులు ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా.. వికాస్‌కు చూపు మాత్రం రాలేదు. ప్రస్తుతం నిజామాబాద్‌లోని అంధుల పాఠశాలలో వికాస్ ఐదో తరగతి చదువుతున్నారు. ఇక అతడికి చూపు లేకున్నా వికాస్ నాయక్.. గాయకుడిగా రాణిస్తున్నాడు. అయితే వికాస్ నాయక్ తండ్రికి రెండు కిడ్నీలు పాడైపోయి.. మంచం పట్టాడు. వికాస్ కంటి చూపు కోసం.. అతడి తండ్రి చికిత్స కోసం ఆ కుటుంబం భారీగా అప్పు చేసింది. దీంతో అసలుతోపాటు వడ్డీ సైతం భారీగా పెరిగిపోయింది. అప్పు వడ్డీ కలిసి.. దాదాపు రూ. 6 లక్షలకుపైగా దాటింది. ఈ నేపథ్యంలో ఇటీవల వికాస్ కుటుంబ సభ్యులు.. జగ్గారెడ్డిని కలిసి కుటుంబ పరిస్థితిని వివరించి.. తమకు సహయం చేయాలంటూ జగ్గారెడ్డికి అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో శనివారం సంగారెడ్డిలోని తన నివాసానికి వికాస్ కుటుంబాన్ని జగ్గారెడ్డి పిలుపించుకున్నారు. ఈ సందర్భంగా రూ. 7.50 లక్షల చెక్కను వికాస్ కుటుంబానికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అంధుడైన వికాస్ గానం చేసిన పాటలకు జగ్గారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. వికాస్‌కు స్మార్ట్ ఫోన్‌ను కొనుగోలు చేసి అందజేశారు. తాను ఇచ్చిన నగదుతో అప్పు తీర్చడమే కాకుండా.. యూట్యూబ్ చానల నిర్వహించుకునేందుకు మిగిలిన మొత్తాన్ని వినియోగించాలంటూ వికాశ్ కుటుంబ సభ్యులకు పీసీసీ వర్కిగ్ ఆ డబ్బుతో అప్పును పూర్తి తీర్చడమే కాకుండా యూట్యూబ్ ఛానల్ నిర్వహణకు మిగిలిన మొత్తాన్ని వెచ్చించాలని వికాస్‌కు సూచించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ.. బాగా చదువుకుని కలెక్టర్ అవడమే తన లక్ష్యమని వికాస్ నాయక్ ఈ సందర్భంగా జగ్గారెడ్డికి వివరించారు. అనంతరం స్వయంగా ఆయనే కారును ఏర్పాటు- చేసి వికాస్ నాయక్ కుటుంబాన్ని వారి స్వస్థలానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పంపించారు.

రాజముద్ర

## సంపాదకీయం

# విమోచన అంటే ఉలికిపాటు ఎందుకో?



తెలంగాణ విమోచన అనగానే పాలకులు ఉలిక్కిపడుతున్నారు. ఏదో పేరు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా జరుపుకోవడానికి జడుస్తున్న నేతలు ఉన్నందుకు మనం సిగ్గుపడాలి. బాజాప్తా ఎందుకు విమోచన జరపలేక పోయారో తగ పాలకులు, నేటి పాలకులు సమాధానం ఇచ్చుకోవాలి. నిజాం నిరంకుశాలను, రజాకార్ల ఆగడాలను ఎదరించడానికి జరిగిన పోరాటం ముమ్మాటికి తిరుగబాటుచరిత్రే అవుతుంది. చైనా,రష్యాల్లో జరిగిన పోరాటలకు ఇది తక్కువేం కాదు. అయినంత మాత్రాన విమోచన దినోత్సవంజరపరాదని అన్నవాళ్లు మూర్ఖులు కాక మరోటి కాదు. దీనిని విస్మరించేలా చేయడం పాలకులకు మంచిది కాదు. ఖాసింరజ్వీ ఘాతుకాలకు అంతులేని చరిత్ర ఉంది. అదంతా చదువుతుంటే రక్తం మరిగిపోతుంది. నిజాం గురించి, ఆ పాలన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విముక్త తెలంగాణ జరిగిన సెప్టెంబర్17న విమోచన ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆకాంక్షలను గత ప్రభుత్వాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కూడా విస్మరించడం ద్వారా చరిత్రను అపహాస్యం చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత దీనిని ఘనంగా జరపాల్సిన ప్రభుత్వం దానిని దాటవేయడం ద్వారా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. దీనిపై తెలంగాణ ఉద్యమ సమయంలో మాట్లాడిన నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడం మరింత అవమానకరం. తెలంగాణలో రజాకార్లు చేసిన ఘాతుకం రక్తచరిత్రకు తార్కాణం. వారి దాష్టీకానికి ప్రజల మాన,ధన, ప్రాణాలు పోయాయి. అన్నింటికి మించి ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలు ఆడించారు. ఇక అత్యాచార ఘటనలకు అంతేలేదు. భర్తల ముందే మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగబడ్డారు. అడ్డొచ్చిన మహిళల భర్తలను అడ్డంగా తెగనరికారు. విమోచన దినోత్సవం జరపడం అంటే దాష్టీకాలను ఎండగట్టడం మాత్రమే. ఆనాటి అరాచాకాలను గుర్తు చేసుకోవడం. ఆనాటి ఘటనల్లో మరణించిన ప్రజలకు నివాళి అర్పించడం. ఎందరో అమాయక స్త్రీలు తమ మానప్రాణాలు కోల్పోయి బలిదానం అయ్యారు. వారిని స్మరించుకుని వారికి నివాళి అర్పించడం మాత్రమే. నిజాం లొంగిపోయిన రోజు అనడం కంటే ఓ నిరంకుశుడిని పారదోలిన కారణంగా హైదరాబాద్ విమోచన దినం జరపడం అన్నది తప్పులేదు. ప్రపంచ చరిత్రలో పోరాటాలన్నీ నిరంకుశత్వం మీద దాడుల కోసం జరిగినవే. వాటిని స్వాతంత్ర్య దినాలుగానే జరుపుకుంటున్నారు.

తెలంగాణ విముక్తం కూడా ఒక స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదిదే. క్రూర రాచరిక తరహా పాలన నుంచి విముక్తి జరిగిన రోజుగా గుర్తించాలి. గతంలోకి వెళితే... ఆఖరి నిజాంకాలంలో, క్రూరభూస్వా మ్యం పడగలెత్తి గ్రామాలను పీడించుకుని తింటున్న ప్పుడు, ప్రజలు తిరగబడ్డారు. పోరాడారు. భూములు ఆక్రమించుకుని పంచు కున్నారు, మరోవైపు నిజాం ను కీలుబొమ్మ చేసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపైన, కొన్ని చోట్ల కాంగ్రెస్ వారిపై, ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడ ఉంటే అక్కడ దౌర్జన్యాలు చేశారు. భూస్వాముల గడీల్లో ఆశ్రయం పొందుతూ వారి తరఫున దాడులు చేశారు. పెద్ద ఎత్తున రక్తపాతం జరిగింది. బైరాన్‌పల్లి, పరకాల ఇలా ఎన్నోచోట్ల అరాచకాలకు అడ్డూ అదుపులేకుండ ఆపోయింది. కేవలం జలియన్‌వాలా బాగ్ గురించి మాత్రమే చెప్పుకుం టాం. పరకాలలో నరమేథం సాగింది. బైరాన్‌పల్లిలో ఆడవాళ్లను నగ్నం గా బతుకమ్మ లను ఆడించారు. పొలాలపై దాడులు చేశారు. ధాన్యాన్ని తరలించారు. క్రూరంగా హింసించారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతటి దారుణాలు జరిగినా స్వాతంత్ర్య పోరాటం కారణంగా ఇవన్నీ మరుగున పడిపోయాయి. మరోవైపు నిజాం, భారత, పాకిస్థాన్ దేశాలు రెంటితోనూ తాను కలవబోనని, స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. ఓ దశలో పాక్‌లో కలవడానికి కూడా సిద్దం అని ప్రకటించాడు. భారత ప్రభుత్వంతో ఆ విషయమై చర్చలు, వాదాలు సాగుతూ ఉండగానే, మరో వైపు కమ్యూనిస్టుల పోరాటం సాగుతూ ఉన్న దశలోనే, భారత ప్రభుత్వం సైనికచర్య జరిపింది. నిజాం లొంగిపోయాడు. నిజాం లొంగడానికి అంతా సాజావుగా సాగలేదు. ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య తీసుకుని ఉండకపోతే హైదారాబాద్ సంస్థనం చరిత్ర మరోలా ఉండేది. అన్ని సంస్థానాలను విలీనం చేసిన సందర్భంగా ఎలాంటి పేచీ రాకున్నా కాశ్మీర్ విషయంలో మొన్నటి దాకా పంచాయితీ తేలలేదు. 370 రద్దుతో మొన్నటికి మొన్న అది సంపూర్ణంగా భారత్‌లో విలీనం అయ్యింది. తెలంగాణ విషయంలో కూడా నెహ్రూ జోక్యం ఉండివుంటే కాశ్మీర్ లాంటి పరిస్థితి మనకు ఉండేది. అయితే తెలంగాణలో రజాకార్ల పాలనలో జరుగుతన్న అరాచాకాలను అందరూ ఎదరించి ప్రాణాలు కోల్పోయారు. నిరంకుశ రాచరిక తరహా పాలన స్థానంలో ప్రజాప్రాతినిధ్య పాలన కోసం జరిగిన పోరాటం అంతా ఇంతాకాదు.

తెలంగాణ అంతర్భాగంగా ఉన్న హైదరాబాద్ రాజ్యంలో జరిగింది జాతీయోద్యమం కాకున్నా అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సాయుధ పోరాటం చేయాల్సి వచ్చింది. గాంధీతో సహా కాంగ్రెస్ వారు ఆనాడు ఇక్కడి ప్రజల గురించి పట్టించు కోలేదు. ఇక కమ్యూనిస్టులు చేసింది భూస్వామ్యా నికి వ్యతిరేకంగా భూమికోసం విముక్తి పోరాటం మాత్రమే. అయితే రజాకార్ల దాష్టీకానికి ప్రజలు సమాయత్తం అయినప్పుడు అంతా కలసి కదిలారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి వీరులు చేసిన త్యాగం తక్కువేం కాదు. 1948 సెప్టెంబర్ 13-17 మధ్య జరిగింది భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంపై జరిపిన పోలీసు చర్య కారణంగా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యింది. ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించడం తో పాటు, ప్రజలు కూడా సంతోషించి సంబరాలు చేసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి జరిగిన విముక్తి పోరాటం కావడంతో ప్రజల్లో సహజంగానే ఆనందం వెల్లి విరిసింది. బానిస సంకెళ్లు తెగినందుకు ఆనందించారు. కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ వేదికగా దీనిని ఆనాడు ప్రస్తావించిన విషయాన్ని మరచిపోయారు.

### తెలంగాణ ఆకాంక్షను చాటిన

# సకలజనుల సమ్మె

## ఆనాటి ఘట్టానికి 14 ఏళ్లు పూర్తి... కేటీఆర్ ట్వీట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :** తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉందో చాటి చెప్పిన మహోధృత ఉద్యమ రూపమే సకలజనుల సమ్మె అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ సారథి కేసీఆర్ పిలుపుతో యావత్ తెలంగాణ సమాజం ఒక్కటైందని ఆయన అన్నారు. సబ్బండ వర్గాలు ఏకమై 42 రోజుల పాటు శాంతియుతంగా నిరసన తెలుపుతూ, తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేశాయని గుర్తు చేశారు. "జైర్ ఏక్ ధక్కా.. తెలంగాణ పక్కా" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదించిన తెలంగాణ ప్రజల ఆత్మీయతను ఆయన గుర్తుచేశారు. సకలజనుల సమ్మెకు శనివారంతో 14 ఏళ్లు పూ-ర్తయిన సందర్భంగా, ఆ సమ్మెలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉందో చాటి చెప్పిన మహోన్నత ఉద్యమ ఘట్టం ఇది అని వ్యాఖ్యానించారు. సబ్బండ వర్గాల ప్రజలు ఏకమై 42 రోజుల పాటు శాంతియుతంగా నిరసన తెలుపుతూ తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేసిన సంఘటన సకలజనుల సమ్మె అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 12, 2011న కరీంనగర్ జనగర్జనలో ఉద్యమ సారథి కేసీఆర్ పిలుపు మేరకు యావత్ తెలంగాణ సమాజం ఒక్కటైన సందర్భాన్ని ఆయన ప్రస్తావించారు. సమ్మెలో స్వచ్ఛందంగా భాగస్వాములై, "జైర్ ఏక్ ధక్కా.. తెలంగాణ పక్కా" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదించిన ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రశంసించారు. నిర్బంధాలను ఛేదించి, ఆంక్షలకు ఎదురొడి, బెదిరింపులను లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా పోరాడిన తెలంగాణ బిడ్డల ధైర్యాన్ని ఆయన కొనియాడారు. సకలజనుల సమ్మెకు నేటితో 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఆ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కేటీఆర్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# శంకర్‌పల్లి దారి దోపిడీ కేసు..

## ప్రధాన సూత్రధారి వ్యాపారి కారు డ్రైవరే

- కేసును ఛేదించిన పోలీసులు
- ఏడుగురు నిందితుల అరెస్ట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :** శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారి దోపిడీని పోలీసులు ఛేదించారు. కారులో వెళుతున్న వ్యాపారిని అడ్డగించి దోచుకున్న కేసులో పోలీసులు వెంటనే దుండుగులను పట్టుకోగలిగారు. దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. జడ్చర్లలో శుక్రవారం అర్ధరాత్రి నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి స్టీల్ వ్యాపారి డ్రైవర్ మధు అని గుర్తించారు. వికారాబాద్ వెళ్లి నగదు తీసుకొస్తున్న విషయాన్ని మధు తన గ్యాంగ్‌కు చెప్పాడు. అనంతరం మధు, సాయిబాబాపై దాడి చేసినట్లు నటించి దుండగులు నగదు బ్యాగుతో పరారయ్యారని పోలీసులు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా కీసరకు చెందిన స్టీల్ వ్యాపారి రాకేశ్ అగర్వాల్ వికారాబాద్‌లో తనకు రావాల్సిన రూ.40 లక్షల కోసం డ్రైవర్ మధు, సహాయకుడు సాయిబాబాను శుక్రవారం ఉదయం పంపారు. వారిద్దరూ డబ్బు తీసుకొని కారులో తిరుగు ప్రయాణ మయ్యారు. శంకర్‌పల్లి మండలం హుస్సేన్‌పూర్-పర్వేద గ్రామాల మార్గంలోకి రాగానే ఓ కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఆ తర్వాత నిందితులు.. తుపాకీ, కత్తితో బెదిరించి డబ్బులు దోచుకెళ్లారు. అయితే కొద్దిదూరం వెళ్లాక నిందితుల కారు బోల్తాపడటంతో రూ. 8.5 లక్షలు వదిలేసి మిగిలిన డబ్బుతో పరారయ్యారు. నిందితుల కోసం పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి పట్టుకున్నారు.

### కస్టడీలో చిత్రవధ అనుభవించా..

# రూ.9 కోట్లు ఇప్పించండి

## ముంబయి పేలుళ్ల కేసు నిర్దోషి



**ముంబయి :** 2006 ముంబయి పేలుళ్ల కేసులో అబ్దుల్ వహీద్ షేక్ దశాబ్దం క్రితమే నిర్దోషిగా విడుదలైన విషయం తెలిసిందే. అప్పట్లో ట్రయల్ కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే, తనపై తప్పుడు కేసు పెట్టినందుకుగానూ రూ.9 కోట్లు చెల్లించాలని అబ్దుల్ తాజాగా డిమాండ్ చేస్తున్నారు. చేయని నేరానికి కస్టడీలో చిత్రహింసలు పెట్టారని ఆరోపించారు. ఈ ఏడాది జులైలో ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈనేపథ్యంలో అబ్దుల్ తనకు పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్, మహారాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. తనకు పునరావాసం కూడా కల్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఇలా అన్యాయంగా శిక్షపడిన కారణంగా పరిహారం పొందిన పలు కేసులను సైతం అతడు ఉదహరించాడు. ముంబయి పేలుళ్ల కేసులో అబ్దుల్‌ను మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్టు చేసింది. 2015లో ప్రత్యేక కోర్టు ఆయనపై నమోదైన అన్ని అభియోగాలను కొట్టివేసింది. 'జైలు శిక్ష అనుభవించిన కారణంగా కెరియర్‌లో కోలుకోలేని నష్టం జరిగింది. విద్య, వృత్తి జీవితం నాశనమైంది. క్రూరమైన కస్టడీ హింస కారణంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చాయి' అని అబ్దుల్ అందులో పేర్కొన్నారు. ఉగ్రవాది అనే కళంకం తనకు ఉపాధి లేకుండా చేసిందని వాపోయారు. ఆ కారణంగా ఎవరూ ఉద్యోగం ఇవ్వడం లేదని ఆరోపించారు. అరెస్టు నాటికి తాను పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నానని వివరించారు. జైలుకు వెళ్లడంతో తనపై ఆధారపడిన కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని చెప్పారు. సామాజికంగా, భావోద్వేగపరంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. వైద్య, జీవన అవసరాల నిమిత్తం రూ.30 లక్షల అప్పుచేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తాను నిర్దోషిగా విడుదలైన సమయంలో ఓ సహ నిందితుడు జైలులో ఉన్నాడని, ఆ నైతిక కారణంతో ఇన్ని రోజులూ పరిహారం కోరలేదని అబ్దుల్ తెలిపారు. అతడు కూడా నిర్దోషి, అమాయకుడని ఈ ప్రపంచానికి తెలిసేవరకు వేచి చూశానని పేర్కొన్నారు.

# డిజిటల్ అరెస్ట్.. వృద్ధుడి నుంచి రూ.3.72 కోట్ల దోపిడీ



**కేరళ :** డిజిటల్ అరెస్ట్ .. ఈ మధ్య సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పంథా. కేసుల్లో ఇరుక్కున్నారంటూ నమ్మించి వారిని భయపెట్టి, ఒత్తిడికి గురిచేస్తారు. దాన్ని ఆసరాగా తీసుకొని ఆ తర్వాత డబ్బులు దండుకుంటారు. ఇలాంటి వాటిపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా.. ఇంకా పలువురు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని మోసపోతున్నారు. తాజాగా కేరళలోని కొల్లాంలో 79 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. కొల్లం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దక్షిణ కేరళ జిల్లాలోని ఓ వృద్ధుడికి జులై 7న వాట్సప్‌లో వీడియో కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తనను తాను బీఎస్ఎన్ఎల్ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అక్రమ కార్యకలాపాలకు మొబైల్ నంబరు వినియోగించినందుకు ముంబయి సైబర్ పోలీసులు ఈ నంబర్‌ను ట్రాక్ చేస్తున్నట్లు తెలిపాడు. కొద్దిసేపటికి దుండగులు పోలీసు దుస్తుల్లో వాట్సాప్ వీడియో కాల్ చేసి తాము ముంబయి సైబర్ పోలీసులమని పేర్కొంటూ.. నకిలీ అరెస్టు వారెంట్ జారీ చేశారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడినందుకు డిజిటల్ అరెస్టు చేశామని వృద్ధుడిని బెదిరించారు. ఇందుకుగాను వీడియో కాల్ ద్వారా వర్చువల్ కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించారు. బాధితుడు వారు చెప్పినట్లు చేయగా.. వాట్సాప్ కాల్‌ను కట్ చేయకుండా దర్యాప్తు అధికారి నిఘాలో ఉండాలనే షరతుతో వర్చువల్ కోర్టు అతడికి బెయిల్ మంజూరుచేసింది. ఎక్కడికీ వెళ్లొద్దని చెప్పి.. పరిశీలన కోసం ఖాతాల్లో ఉన్న డబ్బును వేర్వేరు ఖాతాల్లోకి బదిలీ చేయాలని బెదిరించారు. లేదంటే ఈ కేసులో శిక్ష పడుతుందని బెదిరించడంతో ఆందోళన చెందిన వృద్ధుడు.. వారు చెప్పినట్లుగా వివిధ ఖాతాలకు జులై 23 నుంచి ఆగస్టు 29 మధ్య 17 లావాదేవీలలో రూ.3.72 కోట్లను బదిలీ చేశాడు. వారు ఎంతకీ డబ్బు తిరిగి పంపకపోవడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొల్లం పోలీసులు తెలిపారు. డబ్బు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాలను గుర్తించామని.. వాటిని బ్లాక్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# మావోయిస్ట్ అగ్రనేత సుజాతక్క లొంగుబాటు

## ధృవీకరించిన డిజిపి జితేందర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :** మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన ఎలియాస్ సుజాతక్క తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. గద్వాల ప్రాంతానికి చెందిన ఆమె ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య ఆమె. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జిగా ఉన్నట్లు సమాచారం. సుజాతక్క 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు. ఆమెతో పాటు మరికొందరు మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలుస్తోంది. సుజాతక్కపై రూ.కోటి రివార్డు ఉంది. సుజాతక్క లొంగుబాటు వివరాలను డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఆమె స్వస్థలం గద్వాల జిల్లా గట్టు-మండలం పెంచికలపాడు. ఆమె మొదట్లో ఆర్ఎస్‌యూ, జన నాట్యమండలిలో పని చేశారు. 1996లో కమాండర్‌గా విధులు నిర్వహించారు. 2001లో రాష్ట్ర కమిటీ- సభ్యురాలిగా పనిచేశారు. అనారోగ్య కారణాలతో సుజాతక్క బయటికి వచ్చారు. ఆమెకు రూ.25 లక్షల రివార్డు అందిస్తాం. మావో యిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని ఆహ్వానిస్తున్నాం. మావోయిస్టులు చాలా మంది లొంగిపోతున్నారని జితేందర్ తెలిపారు.



# సొంతింటి కలను కాపాడేందుకు 'ఫండ్'..

## కేంద్రానికి సుప్రీం సూచన

పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనా లను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, దాన్ని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. దేశ పట్టణీకరణ విధానాలకు అనుగుణంగా ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేలా చూడాలని స్పష్టం చేసింది.

### మౌన ప్రేక్షకుడిగా ఉండొద్దు..

రెరాను 'కోరలు తీసిన పులి'గా మార్చొద్దని, అవసరమైన మౌలిక సదుపాయాలు, ట్రైబ్యునళ్లు, సమర్థమంతమైన యంత్రాంగం ఉండాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అప్పుడే వారి ఆదేశాలు వేగంగా, కచ్చితంగా అమలు అవుతాయని అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా ఉండకూడదని హితవు పలికింది. గృహ కొనుగోలుదారులు, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ లేదా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో ఓ సంస్థను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని సూచించింది.



### సముద్ర అధ్యయనానికి..

# సరికొత్త సాంకేతికత

**చెన్నై:** సముద్ర గర్భంలోని రహస్యాలను తెలుసుకోవడానికి కొత్త పద్ధతులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. తాజాగా చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ సముద్రం నుంచి డేటాను సేకరించడానికి కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసింది. 'బోట్-బేస్డ్ రియల్-టైమ్ టోవ్డ్ ప్రొఫైలింగ్ ఓషన్ అబ్జర్వేషన్ సిస్టమ్' అనే కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసినట్లు ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ పేర్కొన్నారు. దీని ద్వారా ఫిషింగ్ బోటును ఉపయోగించి సముద్రగర్భంలోని సమాచారాన్ని సేకరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సముద్రంలోని వాతావరణం, జీవరాశులు, ఖనిజాలు మొదలైన విషయాలకు సంబంధిం చిన సమాచారాన్ని సేకరించి.. అధ్యయనం చేయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. హిందూ మహాసముద్రం లోని డేటాను కొలవడానికి గతంలో స్థిర లేదా లంగరు వేయబడిన పెద్ద పరిశోధనా నౌకలు అవసరమయ్యేవి. అయితే ప్రస్తుతం రూపొందించిన 'బోట్-బేస్డ్ రియల్-టైమ్ టోవ్డ్ ప్రొఫైలింగ్ ఓషన్ అబ్జర్వేషన్ సిస్టమ్'తో తీర మైదాన ప్రాంతాలు, నదులు సముద్రంలో కలిసే నదీ ముఖద్వారం వద్ద కూడా తక్కువ నిర్వహణ ఖర్చులతో కచ్చితమైన సముద్ర డేటాను సేకరించే అవకాశం ఉంటుందని ఎన్ఐఓటీ డైరెక్టర్ పేర్కొన్నారు. దీని కోసం రూపొందించిన 'బోట్ పేస్ట్ రియల్ టైమ్ డేవిట్ మెరైన్ మానిటరింగ్ పరికరాన్ని' ఒక పడవలో ఇన్‌స్టాల్ చేసి.. సముద్రంలోకి వెళ్లాక యాక్టివేట్ చేయాలని తెలిపారు. వర్షపాతానికి సంబంధించిన వివరాలను కూడా దీని నుంచి తెలుసుకోవచ్చన్నారు. బంగాళాఖాతంలోని ఎన్నూర్ సముద్ర తీరంలో ఈ పరిశోధనను విజయవంతంగా నిర్వహిం చినట్లు పేర్కొన్నారు.



## దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరిన ఎంపీపీ మాజీ సర్పంచులు

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** నవాబుపేట్ మండల పార్టీ మండల పరిధిలోని ఆయా గ్రామాల మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ లు నవాబుపేట్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. శనివారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చెవేళ్ళ నియోజకవర్గం నవాబుపేట్ మండల వివిధ గ్రామాల సర్పంచ్ లు, మాజీ ఎంపీపీ, కార్యకర్తలు భారీ ఏత్తున బిఆర్ఎస్ పార్టీ లో చేరడం జరిగింది. మాజీ ఎంపీపీ అక్నాపురం గ్రామం బందయ్య గౌడ్, గోవర్ధన్ రెడ్డి, గోపాల్ యాదవ్, మాజీ సర్పంచ్, బందయ్య యాదవ్, జాఫర్, శ్రీనివాస్, నర్సిములు, మురళి గౌడ్, సలీమ్, బిక్షపతి గౌడ్, రాజేందర్ గౌడ్, శివ గౌడ్, సాయి యాదవ్, శ్రీకాంత్ గౌడ్, వినయ్ గౌడ్, గేట్ వానంపల్లి నరన్ రెడ్డి, విఠల్ రెడ్డి,వసంత్ రెడ్డి, వేమరెడ్డి, మాజీ సర్పంచ్, అశోక్, నర్సిములు, జైపాల్ రెడ్డి, రాములు, మల్లేషం, రుబేన్ కద్చర్ల గ్రామం శ్రీశైలం, గోపాల్, శ్రీనివాస్, మల్లేశం, జగదీశ్ మమ్ దాన్ పల్లిగ్రామం దుబ్బ మల్లయ్య మాజీ సర్పంచ్, బాలయ్య, పెంటయ్య, గోపాల్, గోపాల్ మాజీ సర్పంచ్, కృష్ణా, శ్యామ్ బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం లో మండల కార్యవర్గం సభ అధ్యక్షులు భరత్ రెడ్డి ముఖ్య సలహా దారు మందుల విజయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షులు వడ్ల పురుషోత్తం చారి, కార్య నిర్వాహక కార్యదర్శి బి మాణిక్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, జామచంద్రం, రైతు సంగం: ఎం జగన్ రెడ్డి, రైతు సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేషం, ప్రచార కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఎస్.సి. సెల్ అధ్యక్షులు కావలి రాజు, బి.సి. సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షులు సంతోష్ రెడ్డి, యువజన విభాగం , అధికార ప్రతినిది సుధాకర్, సోషల్ మీడియా అధ్యక్షులు తలరి శేఖర్, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి కే కుమార్ పాల్గొన్నారు.

## లోక్ ఆదాలత్‌లో 5104 కేసులు పరిష్కారం

### జిల్లా ఎస్పి కె.నరసింహ



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లా పోలీస్ పెండింగ్ లో ఉన్న కేసుల్లో 5014 కేసులను పరిష్కరించడం జరిగిందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.ఇందులో 666 క్రిమినల్ కేసులు,2156 ఈ-పెట్టీ కేసులు,2282 యం.వి యాక్ట్, డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగినది అన్నారు.పోలీస్ శాఖ కోర్టులతో సమన్వయంగా పటిష్టం గా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్యమైందని తెలిపారు.దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించాం అన్నారు. బాగా పనిచేసిన జిల్లా పోలీస్ శాఖ సిబ్బందిని అభినందిస్తున్నాను తెలిపారు.




## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీ శారద

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీ శారద అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన లోక్ అదాలత్ కు హాజరైన ప్రజలకు లయన్స్ ఇంటర్నేషనల్ 320ఈ రీజియన్ 5 ఆధ్వర్యంలో గుడిపూడి వెంకటేశ్వర రావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని తెలిపారు.లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా గత 23 రోజులుగా అల్పాహార పంపిణీ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత,మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్,అపూర్వ రవళి,రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మంచాల మమత,సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.వెంకటరమణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మిర్యాల సుధాకర్,మాజీ ఎమ్మెల్యే, లయన్స్ ఐ హాస్పటల్ చైర్మన్ దోసపాటి గోపాల్,లయన్స్ క్లబ్ ఆర్సీ కొండా సంతోష్, సెక్రెటరీ గుండా లక్ష్మయ్య, జిఎంటి కోఆర్డినేటర్ గుడిపూరి వెంకటేశ్వర్ల రావు,పెండెం చంద్రశేఖర్,నూకల వెంకటరెడ్డి, పటేల్ నరసింహారెడ్డి, యామ రామ్మూర్తి,ఈగ దయాకర్ గుప్త,చీకూరి కృష్ణ,బొమ్మగాని శ్రీనివాస్,హరి,మిర్యాల రామ్మూర్తి,సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## దేశంలో తొలిసారిగా అల్ట్రా ఫాస్ట్, క్యూ డాట్ అబ్లేషన్ టెక్నాలజీ

### హెూలిస్టిక్ హాస్పిటల్‌లో విజయవంతంగా ఏడు గుండె ఆపరేషన్లు

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** గుండె సంబంధిత ఆపరేషన్ కోసం తొలిసారిగా అల్ట్రా ఫాస్ట్, క్యూ డాట్ అబ్లేషన్ టెక్నాలజీ విధానాన్ని దక్షిణాసియాలో మరియు భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా నిజాంపేట లోని శ్రీ శ్రీ హెూలిస్టిక్ హాస్పిటల్ ఉపయోగించిందని హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. ఇది భారతీయ వైద్యరంగంలోనే ఓ మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు ఈ విధానం ద్వారా ఇప్పటికే ఏడుగురికి విజయవంతంగా చికిత్స నిర్వహించామని వారందరూ వేగంగా కోలుకున్నారని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా రోగికి చాలా తక్కువ ఒత్తిడి ఉంటుందన్నారు ఆపరేషన్ కేవలం గంట వ్యవధిలోని పూర్తవుతుంద న్నారు వ్యాధికి కేవలం చికిత్స మాత్రమే కాకుండా రోగుల ఆరోగ్యం శ్రేయస్సు ప్రధాన లక్ష్యంగా శ్రీశ్రీ హెూలిస్టిక్ హాస్పటల్ పనిచేస్తుందని అత్యాధునిక ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం అనుభవజ్ఞులైన వైద్య బృందం తమ ప్రత్యేకత అన్నారు ఈ టెక్నాలజీ గురించి ఈరోజు ఆసుపత్రిలో అయన మీడియాకు వెల్లడించారు.

# ఓటరు సర్వేపై ఆదేశాలు..

### మా అధికార పరిధిని అతిక్రమించడమే: ఈసీ




**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా ఈ కసరత్తు చేపట్టేందుకు ఎన్నికల సంఘం సన్నద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్‌ను నిర్వహించాలని సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌కు వ్యతిరేకం గా ఎన్నికల కమిషన్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. రాజ్యాంగానికి అనుగుణంగా ఎన్నికల జాబితా సవరణ, ఎన్నిక ల ప్రక్రియను చేపట్టే ప్రత్యేక అధికారం తమకు ఉ ందని ఈసీ పేర్కొంది. అలాంటప్పుడు దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు సమగ్ర సర్వేను చేపట్టాలంటూ నిరంతరం ఆదేశాలు ఇవ్వడం.. తమ అధికార పరిధిని అతిక్రమించడమే అవుతుందంటూ ఈసీ వ్యా ఖ్యానించింది. ప్రతి సాధారణ, శాసనసభ ఎన్నికలకు ముందు అక్కడ ఉన్న ఓటర్ల జాబితాలలోని ఖాళీలను భర్తీ చేయాల్సిన బాధ్యత తమకు ఉ ంటుందని.. అందువల్లే బిహార్ ఎన్నికలకు ముందు ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించామని సుప్రీంకు తెలిపింది. ఓటర్ల జాబితా స్వచ్ఛత, సమగ్రతను కాపాడుకోవ డం తన చట్టబద్ధమైన బాధ్యత అని.. ప్రస్తుతం తాము అదే నిర్వహిస్తున్నామని స్పష్టం చేసింది. బిహార్‌లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణను సవాల్ చేస్తూ దాఖలైన 10కి పైగా పిటిషన్లను ఈనెల 10న సుప్రీంకోర్టు విచారించింది. ఈ ప్రక్రియను చేపట్టే రాజ్యాంగబద్ధమైన అధికారం ఈసీకి ఉందని స్పష్టంచేసింది. అయితే, ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న తరుణంలో దీన్ని చేపట్టడం సమర్థనీయం కాదని అభిప్రాయపడింది. అదే సమయంలో దీనిపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ ప్రక్రియను కొనసాగించవచ్చని చెబుతూనే.. ఓటర్ల గుర్తింపునకు పరిశీలించే పత్రాల జాబితాలో ఆధార్, రేషన్, ఓటరు ఐడీ కార్డునూ చేర్చాలని ఈసీకి సూచించింది. బిహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ఈసీ ఇప్పటికే పేర్కొన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ ఏడాది చివర్లోనే ఈసీ ఈ ప్రక్రియ ప్రారంభించే సూచనలు కన్పిస్తున్నాయి. అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమ గ్రతను కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది. కాగా బిహార్‌లో ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈసీ ఈ ప్రక్రియ నిర్వహించడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో తమపై దాఖలైన పిటిషన్ లపై ఎన్నికల అధికారులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు.

## పట్టపగలు నడిరోడ్డుపై భార్యను కాల్చి చంపిన భర్త

**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రూప్‌సింగ్ స్టేడియం ఎదుట ఓ వ్యక్తి తన భార్యను తుపాకీతో కాల్చి చంపాడు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులను కూడా తుపాకీతో బెదిరించాడు. అసలేం జరిగిందంటే.. అరవింద్ పరిహార్ అనే వ్యక్తి స్థానికంగా కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఇటీవల నందిని అనే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి మధ్య మనస్పర్ధలు రావడంతో దూరంగా ఉంటున్నారు. మనస్పర్ధలు పెరగడంతో ఆగ్రహానికి గురైన అరవింద్ శుక్రవారం మధ్యాహ్నం నందినీని నడి రోడ్డుపైనే కాల్చి చంపేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. నిందితుడు ఆమె పక్కనే తుపాకీ పట్టుకొని కూర్చొని ఉండడం అక్కడి వారందరినీ భయభ్రాంతులకు గురిచేసింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. నిందితుడు తుపాకీతో వారిని కూడా బెదిరించాడు.

దీంతో బాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అరవింద్ వద్ద ఉన్న ఆయుధాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నందినీని ఆస్పత్రికి తరలించగా.. ఆమె చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## లాడెన్ మీ దేశంలోనే హతమయ్యాడని మర్చిపోయారా?

### పాక్‌కు ఇజ్రాయెల్ కౌంటర్




**ఇజ్రాయెల్ :** ఐరాసలోని భద్రతామండలి వేదికగా పాకిస్థాన్‌కు ఇజ్రాయెల్ కౌంటర్ ఇచ్చింది. కరుడుగట్టిన ఉగ్రవాది బిన్‌లాడెన్‌కు పాక్ ఆశ్రయం కల్పించిందని, అక్కడే అతడు హతమయ్యాడని వ్యాఖ్యానించింది. ద్వంద్వ ప్రమాణాలతో వాస్తవాలను మార్చలేరంటూ విమర్శలు చేసింది. గత రెండేళ్లుగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య పోరు జరుగుతోంది. కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా ప్రతిపాదన మేరకు దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. దీనిని పలు దేశాలు ఖండించాయి. అయితే, ఈ దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సమర్థించుకున్నారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను.. అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. ఆ తర్వాత పాకిస్థాన్ గడ్డపై ఆశ్రయం పొందిన బిన్‌లాడెన్‌ను అమెరికా మట్టుపెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఖతార్‌పై దాడుల గురించి ఐరాస భద్రతామండలిలో చర్చ సందర్భంగా తమ దేశం పేరు ప్రస్తావించడంపై పాకిస్థాన్ అభ్యంతరం చెప్పింది. అలాగే ఇజ్రాయెల్ దాడిని ఖండించింది. ప్రాంతీయ సుస్థిరతను దెబ్బతీసే దురాక్రమణ అని వ్యాఖ్యలు చేసింది. దాంతో ఐరాసలో పాక్ రాయబారి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్‌ను ఉద్దేశించి.. ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి డానీ డానన్ గట్టి కౌంటర్ ఇచ్చారు. "విదేశీ గడ్డపైనున్న ఉగ్రవాదిని ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే ప్రశ్న అడగకూడదు. అడగాల్సిన ప్రశ్న ఏంటంటే.. అసలు ఉగ్రవాదికి ఆశ్రయం ఎందుకు ఇస్తున్నారు అని. బిన్‌లాడెన్‌ను మట్టుపెట్టేందుకు చేసిన ఆపరేషన్ సరైందే అయినప్పుడు.. హమాస్ విషయంలో మేం చేసింది కూడా సరైందే" అని సమర్థించుకున్నారు. 9/11 తర్వాత భద్రతామండలి ఒక తీర్మానాన్ని ఆమోదించిందని, ఏ దేశమూ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటివి చేయకూడదని పేర్కొందన్నారు. అలా కాదని ఆశ్రయం కల్పిస్తే, మండలి నియమావళిని ఉల్లంఘించినట్లే అవుతుందన్నారు. కాగా.. అమెరికాలో 2001, సెప్టెంబర్ 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రదాడి జరిగి 24 ఏళ్లు అయిన నేపథ్యంలో భద్రతామండలి సమావేశమైంది. ఆ చర్చలో భాగంగానే పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్వర్గధామని మరోసారి తేటతెల్లమైంది.

## కెనడా కార్మిక విధానంలో మార్పులు

### విదేశీ వృత్తి నిపుణులపై కత్తి



**కెనడా :** తాత్కాలిక విదేశీ కార్మికుల విధానంలో మార్పులపై కెనడా సంకేతాలిచ్చింది. నిర్దిష్ట రంగాలు, ప్రాంతాల్లో ఎవరు పని చేయాలనే నిబంధనల్లో సంస్కరణలు తీసుకురానుంది. ప్రధాని మార్క్ కార్నీ ప్రకటనతో సాఫ్ట్‌వేర్, వైద్యరంగానికి చెందిన విదేశీ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. శ్రమతో కూడిన పనులు చేసేవారికి మాత్రమే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తే తమ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని భయపడుతున్నారు. తాత్కాలిక విదేశీ వర్కర్ల కార్యక్రమం ఒక 'కేంద్రీకృత విధానం'గా ఉండాలని పార్టీ కాకస్‌లో కార్నీ వ్యాఖ్యానించారు. అది కార్మిక అవసరాలను లక్ష్యంగా చేసుకొనేలా ఉండాలన్నారు. గృహనిర్మాణం, మౌలిక సదు-పాయాలు, సామాజిక సేవారంగాలపై ఒత్తిడిని తగ్గించేలా మార్పులు అవసరమని పేర్కొన్నారు. శాశ్వత నివాసులు కాని వారి వాటాను తగ్గించాలని కార్నీ భావిస్తున్నారు. 2027 చివరికి జనాభాలో వారి వాటాను 7 నుంచి 5 శాతానికి తీసుకురావాలని ప్రణాళిక రచిస్తున్నారు. ఇది కార్యరూపం దాలిస్తే తాత్కాలిక కార్మికుల సంఖ్య భారీగా తగ్గనుంది.

#### నిపుణులకు వచ్చిన ఇబ్బందేంటి?

ఏ మార్పులు తీసుకొస్తామనే విషయంపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించలేదు. కానీ, లేబర్ మార్కెట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నిబంధనలు కఠినతరం కావొచ్చని విశ్లేషకులు చెబుతున్నమాట. డాక్యుమెంటేషన్ ప్రమాణాలు పెంచడం, విదేశీ కార్మికులు త్వరగా ఉపాధి పొందే రంగాలు, ప్రాంతాలను పరిమితం చేయడం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే తమకు అడ్డంకులు తప్పవని అంతర్జాతీయ ప్రతిభావంతులపై ఆధారపడే టెక్, ఆరోగ్య సేవాసంస్థలు ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం ఇలా ఆంక్షలు పెడితే ప్రాజెక్టులు ఆలస్యమవుతాయని, వృద్ధిరేటు మందగిస్తుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కెనడా కు ఇంకా నైపుణ్యం కలిగిన వలసదారుల అవసరం ఉందని కొందరు వ్యాపారవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. అయితే, ప్రస్తుత వ్యవస్థ వేతనాలను తగ్గిస్తోందని, స్థానిక సేవలను ఒత్తిడికి గురిచేస్తోందనేది విమ-ర్శకుల వాదన. ఈ రెండు వర్గాల మధ్య సమతుల్యం తీసుకురావడానికి ప్రభుత్వం ప్రస్తుతం కసరత్తు చేస్తోంది. బాధ్యతాయుతమైన వలసల నిర్వహణ నిమిత్తం మార్క్ కార్నీ ప్రభుత్వం కొంతకాలంగా సంస్కరణలు చేపడుతోంది. వ్యూహాత్మక రంగాలు, ప్రాంతాలను కుదిస్తూ ముందుకెళ్తోంది. తాత్కాలిక నియామకాలపై అతిగా ఆధారపడటాన్ని తగ్గిస్తోంది. నూతన విధానంపై త్వరలో ప్రావిన్స్‌లు, కంపెనీ ప్రతినిధులు, సెటిల్‌మెంట్ ఏజెన్సీలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే మార్పులు తీసుకొస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే, అత్యధిక డిమాండ్ ఉన్న రంగాల్లో పనిచేస్తున్న వృత్తి నిపుణులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని పలువురు ఒట్టావాను కోరుతున్నారు.



## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కార్కీకు మోదీ అభినందనలు

**న్యూఢిల్లీ :** హింసాత్మక అల్లర్ల అనంతరం నేపాల్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధానిగా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీ బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా భారత ప్రధాని మోదీ ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'నేపాల్ తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సుశీలా కార్కీకి నా శుభాకాంక్షలు. పొరుగుదేశంలోని ప్రజల శాంతి, పురోగతికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది' అని ఆయన రాసుకొచ్చారు.

#### గిన్నెలు ఉన్నచోట చప్పుడు సహజమే..

ఉత్తరప్రదేశ్‌లోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చదువుకున్న కార్కీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో భారత్‌తో తనకున్న సంబంధాల గురించి మాట్లాడారు. మోదీ గురించి మాట్లాడుతూ.. 'ఆయనకు ముందుగా నమస్కారం అని చెబుతాను. ఆయనపై నాకు చాలా మంచి అభిప్రాయం ఉంది. ఇరువురి మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయి' అని కార్కీ పేర్కొన్నారు. భారత్- నేపాల్ మధ్య సంబంధాలకు ఒక చరిత్ర ఉందని ఆమె తెలిపారు. భారత్ అన్ని సమయాల్లో నేపాల్‌కు అండగా ఉందన్నారు. అయితే, వంటగదిలో గిన్నెలు ఉన్నచోట చప్పుడు సహజమే అని, ఇప్పుడు అదే జరుగుతోందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాల మధ్య భిన్నాభిప్రాయాలు సహజమేనన్న ఆమె.. ఇరుదేశాల ప్రజల మధ్య ప్రేమపూర్వక సంబంధాలు ఉన్నాయన్నారు. తమ బంధువులు, పరిచయ-స్థులు ఎంతోమంది ఆ దేశంలో ఉన్నారని కార్కీ వెల్లడించారు. ఈసందర్భంగా బెనారస్ యూనివర్సిటీలో చదువుకున్న రోజులను ఆమె గుర్తుచేసుకున్నారు.





## భారత్‌పై టారిఫ్‌లు విధించేందుకు.. జీ7 దేశాల అంగీకారం..?

### ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన జీ7 సభ్య దేశాలు

**యూఎస్ :** ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది. అందులో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని చూస్తోంది. ఈక్రమంలో ఈయూ, జీ7 దేశాలు భారత్, చైనాలపై టారిఫ్‌లు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జీ7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. జీ7 దేశాల ఆర్థిక మంత్రులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య సుంకాల విధింపుపై చర్చ జరిగింది. ఈ చర్చకు సంబంధించిన విషయాలను అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. "ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి నిజంగా కట్టుబడి ఉంటే.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకురావాలని యూఎస్ వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారు. ఇందుకోసం మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై సుంకాలు విధించాలంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రతిపాదనలను ఉద్ఘాటించారు. ఇప్పటికే.. భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని అక్కడ ప్రస్తావించారు. ఈసందర్భంగా యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామంటూ జీ7 సభ్యదేశాలు అమెరికాకు హామీ ఇచ్చాయి. ఈ క్లిష్ట సమయంలో అమెరికాతో కలిసి ఈ దేశాలు కూడా నిర్ణయాత్మక చర్యలు చేపడుతాయని ఆశిస్తున్నాం" అని జామిసన్ గ్రీర్ తన ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో భారత్, చైనాలపై సుంకాల విధింపునకు ఆయా దేశాలు కూడా సిద్ధమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. కాగా.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంతకుముందు ఐరోపా సమాఖ్య(ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈవిషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జీ7 దేశాల ముందుపెట్టడం గమనార్హం.

## మన ప్రధానుల సంప్రదాయం ఇది కాదు..

### మోదీ మణిపుర్ పర్యటనపై ప్రియాంక విమర్శలు



**వయనాడ్ :** జాతుల మధ్య ఘర్షణ జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ మణిపుర్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పర్యటనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మణిపుర్‌లో ఘ-ర్షణలు జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ అక్కడ పర్యటనకు వెళ్లడం దురదృష్టకరమన్నారు. భారత్‌లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదంటూ విమర్శించారు. ప్రమాదాలు, విషాదాలు జరిగినప్పుడు ప్రధానులు వెంటనే అక్కడికి వెళ్తారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అందరు ప్రధానులు ఇదే పాటించారని తెలిపారు. కానీ, మోదీ మాత్రం రెండేళ్ల తర్వాత దీన్ని పాటిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఇక, మోదీ పర్యటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న మోదీ మిజోరం రాజధాని ఆయిజోల్ కేంద్రంగా రూ.8,071 కోట్లతో కొత్తగా నిర్మించిన 51.38 కి.మీ. పొడవైన రైలు కారిడార్‌ను ప్రారంభించారు. ఈ పర్యటన దృష్ట్యా మణిపుర్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.

# సబ్బులు, షాంపూల ధరలు తగ్గించిన హెచ్‌యూఎల్




జీఎస్టీ రేట్లు సవరించిన నేపథ్యంలో ప్రముఖ ఎఫ్ఎంసీజీ బ్రాండ్ హిందుస్థాన్ యూనిలీవర్ తమ ఉత్పత్తుల ధరలను తగ్గించింది. ఆ కంపెనీ విక్రయించే కిసాన్ జామ్, హార్లిక్స్, లక్స్ సోప్, డవ్ షాంపూ వంటి ధరలు దిగి రానున్నాయి. సవరించిన ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు ఏ వస్తువు ధర ఎంత తగ్గుతుందో తెలియజేస్తూ పత్రికా ప్రకటన ఇచ్చింది. నిత్యం వినియోగించే వస్తువులతో పాటు ఆటోమొబైల్, టెలివిజన్ ధరలు కూడా తగ్గిస్తూ సెప్టెంబర్ 3న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్‌యూఎల్ ధరల సవరణ చేపట్టింది. 340 ఎంఎల్ డవ్ షాంపూ బాటిల్ ఎమ్మార్పీ రూ.490 ఉండగా.. సెప్టెంబర్ 22 నుంచి రూ.435కే లభించనుంది. 75 గ్రాముల లైఫ్‌బాయ్ సోప్ ధర రూ.68 నుంచి రూ.60కి తగ్గించింది. 200 గ్రాముల హార్లిక్స్ జార్ ధర రూ.130 నుంచి రూ.110కు తగ్గిస్తున్నట్లు పేర్కొంది. 200 గ్రాముల కిసాన్‌జామ్ ధర రూ.90 నుంచి రూ.80కి తగ్గనుంది. వీటితో పాటు క్లినిక్‌ప్లస్ షాంపూ, లక్స్, క్లోజప్ టూత్ పేస్ట్, బూస్ట్, బ్రూ కాఫీ, నార్ సూప్ వంటి ఉత్పత్తుల ధరలు కూడా తగ్గిస్తున్నట్లు హెచ్‌యూఎల్ పేర్కొంది. కొన్ని ఉత్పత్తుల ధరలు తగ్గించగా.. రూ.10, రూ.20 ప్యాక్‌ల ధరలు స్థిరంగా కొనసాగనున్నాయి. ఆ మేర ప్యాకింగ్‌లో మార్పులు జరగనున్నాయి. కొత్త స్టాక్‌కే కాదు ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న ఉత్పత్తుల ఎమ్మార్పీని మార్చుకునే వెసులుబాటును కేంద్రం కల్పించింది. స్టిక్కర్, స్టాంప్, ఆన్‌లైన్ ప్రింట్ మార్చుకునేందుకు అనుమతిచ్చింది. దీంతో స్టాక్‌తో సంబంధం లేకుండా సెప్టెంబర్ 22 నుంచి సవరించిన జీఎస్టీ ప్రయోజనం వినియోగదారులకు బదిలీ కానుంది.







# 6 కోట్లు దాటిన రిటర్నులు..

## ఇంకా రెండ్రోజులే గడువు

గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు (సెప్టెంబర్ 13) 6 కోట్ల రిటర్నులు దాఖలైనట్లు ఆదాయపు పన్ను విభాగం వెల్లడించింది. ఈ మైలురాయిని చేరుకోవడంలో పన్ను చెల్లింపుదారులు, పన్ను నిపుణుల సహకారం మరువలేనిదని పేర్కొంది. సెప్టెంబర్ 15 గడువు దగ్గర పడుతుండడంతో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంది. రిటర్నుల ఫైలింగ్‌లో పన్ను చెల్లింపుదారులకు సాయపడేందుకు తమ హెల్ప్ డెస్కులు 24ఐ7 పనిచేస్తాయని తెలిపింది. కాల్స్, లైవ్ చాట్స్, వెబ్‌ఎక్స్ సెషన్లు, ఎక్స్ ద్వారా హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుందని తెలపింది. మరో రెండ్రోజుల్లో గడువు ముగుస్తున్న నేపథ్యంలో చివరి నిమిషం వరకు వేచి చూడకుండా రిటర్నులు దాఖలు చేయాలని సూచించింది. గతేడాది (2024-25 మదింపు సంవత్సరం) విధంగా 2024 జులై 31 నాటికి 7.28 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి. అంతకుముందు ఏడాది 6.77 కోట్ల రిటర్నులు ఫైల్ అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 6 కోట్లకు పైగా రిటర్నులు దాఖలు కాగా.. 5.50 కోట్ల రిటర్నులు వెరిఫై అయ్యాయని, అందులో 3.78 కోట్ల రిటర్నులు ప్రాసెస్ చేసినట్లు ఆదాయపు పన్ను విభాగం పేర్కొంది. ఒకవేళ గడువులోగా పన్ను రిటర్నులు దాఖలు చేయకపోతే రూ.5 లక్షలలోపు ఆదాయం ఉంటే.. రూ.1,000, రూ.5 లక్షలకు మించి ఆదాయం ఉన్నవారు రూ.5,000 చొప్పున ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించని పన్ను మొత్తంపై నెలకు 1 శాతం చొప్పున వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుంది.

### రూ.12 లక్షలపై అసత్య ప్రచారం

ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఊరట కల్పిస్తూ ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. కొత్త ఆదాయపు పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ఎలాంటి పన్నూ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. ఈ ఊరట 2025-26 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తుంది. అంటే వచ్చే ఏడాది పన్ను రిటర్నులు దాఖలు సమయంలో ఈ మినహాయింపును వినియోగించుకోవాల్సి ఉంటుంది. అయితే, రూ.12 లక్షల వరకు మినహాయింపు ఈ ఏడాదికీ వర్తిస్తుందంటూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం జరుగుతోందంటూ కొందరు పన్ను నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో చాలా మంది రిటర్నులు దాఖలు చేయకుండా దూరంగా ఉంటున్నారంటూ చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ మినహాయింపు వర్తించదని పేర్కొంటున్నారు. కాబట్టి రూ.3 లక్షలు ప్రాథమిక ఆదాయ పరిమితి దాటిన ప్రతి ఒక్కరూ రిటర్నులు దాఖలు చేయాలని సూచిస్తున్నారు.




# క్రికెటర్లను బీసీసీఐ బలవంతపెట్టొద్దు

## పాక్‌తో మ్యాచ్‌పై పహల్గాం బాధితురాలి ఆవేదన



ఆసియా కప్‌లో భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో పాక్‌తో మ్యాచ్ ఆడొద్దని దేశ ప్రజలు అనేకసార్లు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. అయితే పలు నిబంధనల మేరకే ఆదివారం ఆ మ్యాచ్ ఆడుతున్నట్లు ఐసీసీ, ఏసీసీ ప్రకటించడంపై పహల్గాం ఉగ్రదాడిలో భర్తను కోల్పోయిన బాధితురాలు ఐషాన్య ద్వివేది స్పందించారు. భారత్-పాక్ మ్యాచ్‌పై బీసీసీఐ తీసుకున్న నిర్ణయాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంలో బీసీసీఐ క్రికెటర్లను బలవంతపెట్టొద్దన్నారు. అసలు మ్యాచ్‌కి కూడా అంగీకరించకుండా ఉండాల్సిందని ఆవేదన వ్యక్తంచేశారు. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగాలను బీసీసీఐ విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. భారత్-పాక్ మ్యాచ్‌ను బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. కేవలం ఇద్దరు ముగ్గురు క్రికెటర్లే ముందుకువచ్చారని.. మిలిగినవారు ఈ విషయాన్ని పట్టించుకోలేదని ఐషాన్య అన్నారు. పాక్‌తో మ్యాచ్ ఆడాలని క్రికెటర్లను బీసీసీఐ బలవంతపెట్టొద్దని.. దేశం తరఫున నిలబడాలని సూచించాలన్నారు. కానీ అందుకు విరుద్ధంగా బీసీసీఐ నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. పహల్గాం దాడిలో తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాల వేదనను అప్పుడే మర్చిపోయారా అని స్పాన్సర్లు, క్రికెటర్లను ప్రశ్నించారు. ఈ మ్యాచ్‌తో వచ్చిన ఆదాయాన్ని ఆ దేశ ప్రభుత్వం మళ్లీ ఉగ్రవాదులను పోషించడానికే ఉపయోగిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మ్యాచ్‌ను నిర్వహిస్తే.. మనపై దాడి చేయడానికి వారిని మనమే సిద్ధం చేస్తున్నట్లు అవుతుందన్నారు. దేశ ప్రజలంతా భారత్-పాక్ మ్యాచ్‌ను వీక్షించకుండా బహిష్కరించాలని కోరారు. పహల్గాం ఉగ్రదాడిలో హనీమూన్ కోసం కశ్మీర్‌కు వెళ్లిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యాపారి శుభమ్ ద్వివేది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కాన్పుర్‌కు చెందిన శుభమ్ ద్వివేదికి.. ఇషానాయ్ ద్వివేదితో ఫిబ్రవరి 12న వివాహమైంది. అనంతరం ద్వివేది.. తన భార్యతో విహారయాత్ర కోసం కశ్మీర్ వెళ్లారు. వారు బైసరన్ లోయలో సరదాగా విహరిస్తున్న సమయంలో వారిని చుట్టుముట్టిన ఉగ్రవాదులు పేరు అడిగి ముందుగా ద్వివేది తలపై కాల్చి చంపినట్లు ఆయన భార్య పేర్కొన్నారు. ఆ దాడిలో ద్వివేదితో సహా 26 మంది పర్యాటకులు తమ ప్రాణాలను కోల్పోయారు.



# భారత్.. పాకిస్థాన్‌తో మ్యాచ్

## ఎందుకు ఆడుతోందంటే..

### మాజీ క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్

ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 14న దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా టీమ్‌ఇండియా, పాకిస్థాన్‌తో తలపడనుంది. అయితే ఈ పోరుపై భారత అభిమానుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పాక్ ఉగ్రవాదులు పహల్గాంపై దాడి చేసిన అనంతరం ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీమ్‌ఇండియా.. పాకిస్థాన్‌తో ఏ విధమైన క్రికెట్ సంబంధాలూ కొనసాగించకూడదని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే టీమ్‌ఇండియా మాత్రం ఆసియా కప్ షెడ్యూలు ప్రకారం పాకిస్థాన్‌తో తలపడబోతోంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే టోర్నమెంట్లను బహిష్కరించలేమని మాజీ క్రీడా శాఖ మంత్రి, ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు అనురాగ్ ఠాకూర్ వివరించారు. 'ఆసియా క్రికెట్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగే మల్టీనేషనల్ టోర్నమెంట్లలో వారికి కేటాయించిన మ్యాచుల్లో కచ్చితంగా పాల్గొనాలి. ఒక వేళ ఆడకుంటే.. ఆయా దేశాల జట్లను ఆ టోర్నమెంట్ నుంచి ఎలిమినేట్ చేస్తారు. అలాగే ప్రత్యర్థి జట్టుకు పాయింట్లు జోడిస్తారు. అయితే టీమ్‌ఇండియా.. ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక టోర్నమెంట్లు ఆడదు. పాక్.. భారత్‌పై ఉగ్రవాద దాడులు ఆపేసే వరకు టీమ్‌ఇండియా ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని మేం చాలా కాలం క్రితమే నిర్ణయం తీసుకున్నాం' అని అనురాగ్ ఠాకూర్ మీడియాతో అన్నారు. భారత్, పాకిస్థాన్‌లు చివరిసారిగా 2012/13లో ద్వైపాక్షిక సిరీస్‌లో తలపడ్డాయి. అప్పటి నుంచి ఇరు దేశాలు, ఐసీసీ ఆధ్వర్యంలో జరిగే వన్డే వరల్డ్ కప్, టీ20 వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌లాంటి మల్టీనేషనల్ పోటీలకే పరిమితమయ్యాయి. ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద గ్రూపులపై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో భారత్.. పాకిస్థాన్‌తో ఏ విధమైన క్రికెట్ సంబంధాలు కొనసాగించకూడదని, ఆసియా కప్‌లోనూ ఆ దేశంతో మ్యాచ్ ఆడకూడదని భారత అభిమానులు, పలువురు మాజీలు కోరుకుంటున్నారు.




## మరో రెండు మూడు వారాల్లో టీమ్‌ఇండియా

# స్పాన్సర్ ఎవరో తేలుతుంది

### బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందిన తర్వాత.. అంతవరకూ టీమ్‌ఇండియా జెర్సీ స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11 వైదొలగింది. దీంతో బీసీసీఐ నూతన జెర్సీ స్పాన్సర్‌ను అన్వేషించే పనిలో ఉంది. ఆసక్తి ఉన్న కంపెనీల నుంచి దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 16న ముగియనుంది. ఆ తర్వాత స్పాన్సర్ ఎంపిక ప్రకియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా.. స్పాన్సర్ లేకుండానే ఆసియా కప్‌లో తలపడుతోంది. ఈ విషయానికి సంబంధించి బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా.. శనివారం ఓ కీలకమైన విషయాన్ని చెప్పారు. మరో రెండు మూడు వారాల్లోనే కొత్త జెర్సీ స్పాన్సర్ ఎవరో తేలుతుందన్నారు. 'టెండర్ల ప్రకియ ప్రారంభమైంది. చాలా మంది బిడ్లు వేశారు. నాకు తెలిసి.. మరో 15, 20 రోజుల్లోనే అది ఎవరో తెలుస్తుంది. ఇప్పటి వరకైతే ఎవరి పేరూ అనుకోలేదు. ప్రక్రియ పూర్తైన తర్వాత మేం వెల్లడిస్తాం' అని ఓ కార్యక్రమంలో వివరించారు. అలాగే సవరించిన జీఎస్టీ వల్ల ఐపీఎల్ టికెట్ల ధరలు పెరిగాయి. ఇంతకు ముందు రూ.500 ఉన్న టికెట్ ధర రూ.700లకు, రూ.2,000 ఉన్న టికెట్ వెల రూ.2,800లకు పెరిగింది. విషయమై కూడా ఆయన మాట్లాడారు. 'చాలా మంది సాధారణ ప్రజలు ఐపీఎల్‌ను ఆసక్తిగా వీక్షిస్తున్నారు. టికెట్ ధరల పెరుగుదల వారిపై కచ్చితంగా ప్రభావం చూపుతుంది. అయితే ఇకముందూ పెద్ద సంఖ్యలోనే జనాలు ఐపీఎల్ చూసేందుకు వస్తారని ఆశిస్తున్నా' అని ఆయన అన్నారు. బీసీసీఐ.. ప్రభుత్వం నుంచి ఎన్నో పన్ను మినహాయింపులు పొందుతోందని వస్తున్న విమర్శలపై కూడా ఆయన స్పందించారు. 'బీసీసీఐ ఓ కార్పొరేట్ కంపెనీలానే పన్నులు చెల్లిస్తోంది. అలాగే జీఎస్టీ కూడా కడుతోంది. మాకు ఎలాంటి మినహాయింపులూ లేవు. మేం కొన్ని వేల కోట్ల రూపాయలను పన్నుల రూపంలో చెల్లిస్తున్నాం. స్టేట్ అసోసియేషన్లు కూడా పన్నులు కడుతున్నాయి. మేం ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా గ్రాంట్ రూపంలో పొందలేదు' అని రాజీవ్ శుక్లా వివరించారు. అలాగే మహిళల క్రికెట్ విషయమై కూడా ఆయన మాట్లాడారు. 'మేం మహిళల క్రికెట్‌ను ప్రమోట్ చేస్తున్నాం. టోర్నమెంట్లు నిర్వహిస్తున్నాం. అన్ని సౌకర్యాలనూ కల్పిస్తున్నాం. జనాలు చేయాల్సిందల్లా.. మైదానానికి వచ్చి మహిళల క్రికెట్‌ను వీక్షించడమే' అని ఆయన పేర్కొన్నారు.

## దుబాయ్‌లో

# ఎవరి 'బంతి' తిరిగేనో..




ఆసియా కప్‌లో భారత్ - పాకిస్థాన్ పోరుకు అంతా సిద్ధం. ఇరు జట్లూ ఇప్పటికే తొలి మ్యాచులు ఆడేశాయి. పసికూనలపై ఘన విజయాలను నమోదు చేశాయి. ఇప్పటివరకూ జరిగిన నాలుగు మ్యాచులు రసవత్తరంగా లేవనే చెప్పాలి. ఆదివారం దుబాయ్ వేదికగా భారత్ - పాక్ పోరులో ఎవరిది పైచేయి అవుతుందనేది ఆసక్తికరంగా మారింది. పిచ్‌ను చూస్తే 'స్పిన్'దే కీలక పాత్ర. ఇరుజట్లలోనూ నాణ్యమైన స్పిన్ విభాగం ఉంది.

### మనోళ్లు ఇలా..

అంతర్జాతీయంగా టీ20 టాప్ స్పిన్నర్ల జాబితాలో వరుణ్ చక్రవర్తి రెండో స్థానం. ఐసీసీ ర్యాంకుల్లో భారత్ తరఫున మెరుగైన బౌలర్ కూడా అతడే. గత ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్‌ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇక అక్షర్ పటేల్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా అదరగొట్టేస్తున్నాడు. మరి వీరిద్దరిని నడిపించే 'చైనామన్' బౌలర్ కుల్‌దీప్ యాదవ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఆరు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే అవకాశం రావడంతో దాన్ని రెండు చేతులతో అందిపుచ్చుకున్నాడు. దుబాయ్ పిచ్ తన సొంతమనేలా చెలరేగిపోయాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఫామ్‌ను కొనసాగిస్తూ.. ఆసియా కప్ తొలి మ్యాచ్‌లోనే యూఏఈపై నాలుగు వికెట్ల ప్రదర్శన చేశాడు. వైవిధ్యమైన అతడి బౌలింగ్ ముందు పసికూన నిలవలేకపోయింది. అయితే, చాన్నాళ్లు బెంచ్‌కే పరిమితమైనా తనలోని సత్తా తగ్గలేదని నిరూపించాడు. స్టంప్స్ లక్ష్యంగా అతడి బౌలింగ్‌ను తట్టుకోవడం పాక్ యువ బ్యాటింగ్ విభాగానికి కష్టమే. తన 'స్పిన్' ఎటాక్‌తో విరుచుకుపడతాడని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### నలుగురితో పాక్..

ఇటీవలే అఫ్గాన్‌పై హ్యాట్రిక్ వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన మహ్మద్ నవాజ్ అత్యంత ప్రమాదకారి. అతడికి తోడుగా అబ్రార్ అహ్మద్ కూడా కీలకమే. ఇక సుఫియాన్ ముకీమ్, సయామ్ అయూబ్ కూడా పార్ట్ స్పిన్‌తో వికెట్లు తీసే బౌలర్లు. అయితే, భారత బ్యాటర్లు వీరిని ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. సీనియర్లు రోహిత్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ వంటి ఆటగాళ్లు లేకుండా తొలిసారి మినీ టోర్నీలో టీమ్‌ఇండియా ఆడుతోంది. స్పిన్‌ను కాచుకొని క్రీజ్‌లో నిలదొక్కుకుంటే దుబాయ్‌లో పరుగులు చేయడం పెద్ద కష్టమేం కాదు.

### 'కీ' ప్లేయర్లు వీరే

భారత్ - పాకిస్థాన్ మ్యాచ్‌లో ఎవరు బాగా ఆడితే ఆ బ్యాటర్ లేదా బౌలర్ హైలైట్ అయిపోవడం ఖాయం. ఇప్పుడు కూడా ఇరుజట్లలోనూ ప్రధాన ప్లేయర్లు తమ సత్తా చాటేందుకు ఆత్రుతగా ఉన్నారు. జస్‌ప్రీత్ బుమ్రాను పాక్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారో చూడాలి. టీమ్‌ఇండియాపై చెలరేగిపోయే షహీన్ అఫ్రిదిపై మన బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తే తిరుగుండదు. బ్యాటింగ్‌లో అభిషేక్- గిల్ జోడీ.. బౌలింగ్‌లో కుల్‌దీప్ -వరుణ్ చక్రవర్తి జోడీ ప్రధాన ఆకర్షణ అనడంలో సందేహం లేదు.

# ఏజీఎంకు నామినేట్.. హర్భజన్‌కు బీసీసీఐ పోస్టు?



మరో రెండు వారాల్లో భారత క్రికెట్ బోర్డు సర్వసభ్య సమావేశం జరగనుంది. బీసీసీఐ అధ్యక్షుడిగా రోజర్ బిన్నీ స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసే అవకాశం ఉంది. దీంతో ఆ పదవిలోకి మరోసారి మాజీ క్రికెటర్‌కే ఛాన్స్ వస్తుందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే సచిన్ తెందూల్కర్ పేరు రాగా.. ఆయన టీమ్ ఆ కథనాలను ఖండించింది. తాజాగా మాజీ క్రికెటర్లు కిరణ్ మోరె, హర్భజన్ సింగ్ పేర్లు వార్తల్లోకి వచ్చాయి. హర్భజన్ సింగ్‌కు బీసీసీఐ పోస్టు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనేది క్రికెట్ వర్గాల మాట. దానికి పంజాబ్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయం కూడా బలం చేకూరుస్తోంది. ఏజీఎంలో తమ ప్రతినిధిగా హర్భజన్‌ను పంజాబ్ నామినేట్ చేసింది. పంజాబ్ తరఫున సర్వసభ్య సమావేశానికి హర్భజన్ హాజరవుతాడు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ కూడా బెంగాల్ క్రికెట్ సంఘం తరఫున ఏజీఎంలో పాల్గొంటాడు. ఒకవేళ హర్భజన్‌సింగ్‌కే బీసీసీఐ అధ్యక్ష పదవి లభిస్తే మరో వరల్డ్ కప్ విజేత జట్టు సభ్యుడికి ఛాన్స్ వచ్చినట్లు అవుతుంది.



# రూ.140 కోట్లకు ఢిల్లీ బంగళా..


## అత్యధిక ధర చెల్లించిన హైదరాబాద్ వ్యాపారవేత్తలు

ఢిల్లీలో 883 చదరపు మీటర్లలో విస్తరించిన ఓ భవంతిని హైదరాబాద్‌కు చెందిన విశ్వ సముద్ర గ్రూప్ కొనుగోలు చేసింది. వ్యాపారవేత్తలు శశిధర్ చింతా, లక్ష్మీ ప్రియదర్శిని చింతా ఆ విశాలమైన బంగళాను దక్కించుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో రిజిస్టర్ లావాదేవీకి సంబంధించిన సేల్ డీడ్ నమోదైంది. రూ.8.96 కోట్లను స్టాంప్ డ్యూటీ కింద కంపెనీ ప్రతినిధులు చెల్లించారు. విశ్వసముద్ర గ్రూప్ ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పన వ్యాపారాల్లో రాణిస్తోంది. ప్రస్తుతం కొనుగోలు చేసిన బంగళా ఉమ్మడి యాజమాన్యంలో ఉంది. దీంతో 10 మంది ఆస్తి బదిలీకి చెందిన దస్త్రాలపై సంతకాలు చేసినట్లు తెలిసింది. తాజాగా జరిగిన లావాదేవీతో లుటియన్స్ బంగళా జోన్(ఎల్‌బీజడ్) మరోసారి వార్తల్లోకెక్కింది. భారతదేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాంతాల్లో ఆస్తులకు డిమాండ్ నిరంతరం పెరుగుతోందనే విషయాన్ని ఈ లావాదేవీ నిరూపించింది. ఎల్‌బీజడ్, దక్షిణ ఢిల్లీలో ఇటీవల కాలంలో రూ.100 కోట్ల విలువైన స్థిరాస్తి లావాదేవీలు చాలా జరిగాయి. 'లుటియన్స్ ఢిల్లీకి బయటి వ్యాపారవేత్తల నుంచి డిమాండ్ బాగా ఉంది. ఈ ప్రాంతం తమ చిరునామాగా ఉండాలని వారు కోరుకుంటున్నారు. అందుకోసం మార్కెట్ విలువ ఎంతైనా చెల్లించడానికి సిద్ధపడుతున్నారు' అని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పేర్కొన్నారు. 28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో లుటియన్స్ బంగళా జోన్ కేంద్రీకృతమైంది. దాదాపు 3 వేల బంగళాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ ప్రధానంగా మంత్రులు, న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు నివసిస్తున్నారు. భారత్‌లోని సంపన్న వ్యాపారవేత్తలకు చెందిన 600 స్థిరాస్తులు ఇక్కడ ఉన్నట్లు సమాచారం.

# బొటానిక్ హెల్త్‌కేర్ తయారీ యూనిట్ ప్రారంభం

న్యూట్రాస్యూటికల్ పరిశోధనలు, ఉత్పత్తుల తయారీలో నిమగ్నమై ఉన్న బొటానిక్ హెల్త్‌కేర్, హైదరాబాద్‌లో ప్రత్యేకంగా లిపోసోమల్ ఉత్పత్తి యూనిట్ ప్రారంభించింది. దీనిపై రూ.25 కోట్లు పెట్టుబడి పెట్టింది. దాదాపు 8,500 మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం గల ఈ యూనిట్‌ను 'లిప్సబయో' పేరుతో ఏర్పాటు చేశారు. పౌడర్ రూపంలో లిపోసోమల్ విటమిన్లు, ఖనిజాలు, ఇతర ఫార్ములేషన్లు ఇందులో ఉత్పత్తి చేస్తారు. దీని కోసం కంపెనీ సొంతంగా అభివృద్ధి చేసిన డీఎఫ్ఎస్ (డయాట్రీ ఫైబర్ స్టెబిలైజ్డ్) టెక్నాలజీని వినియోగిస్తారు. దీనివల్ల న్యూట్రాస్యూటికల్, ఫార్మాస్యూటికల్, కాస్మెస్యూటికల్ ఆహార పదార్థాలను లిపోసోమల్ రూపంలో ఆవిష్కరించడానికి వీలుకలుగుతుందని కంపెనీ వివరించింది.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# మిరాయ్ తొలిరోజు 27 కోట్లు వసూలు

## చిత్ర విజయంతో హీరో తేజ సజ్జా ఆనందం

యంగ్ హీరో తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో నటించిన తాజా చిత్రం మిరాయ్. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా వాటిని అందుకోవడంలో విజయం సాధించింది. తాజాగా నిర్మాణసంస్థ అధికారికంగా దీని వసూళ్లను వెల్లడించింది.తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 27.20 కోట్లు వసూలుచేసినట్లు తెలిపింది. దీనిపై హీరో తేజ సజ్జా స్పందిస్తూ.. మీ ప్రేమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇదే చరిత్ర, ఇదే భవిష్యత్తు, ఇదే మిరాయ్ అని ఆనందం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగానే కాకుండా ఓవర్సీస్‌లోనూ మిరాయ్‌కు మంచి స్పందన లభిస్తోంది. మొదటిరోజు విదేశాల్లో రూ. 7లక్షల డాలర్లు వసూలుచేసినట్లు నిర్మాణ సంస్థ పేర్కొంది. దీని వీఎఫ్ఎక్స్ వర్క్‌పై నెట్టింట ప్రశంసలు వస్తున్నాయి. ప్రముఖులు కూడా దీనిపై పోస్ట్ పెడుతున్నారు. దీనిపై నిర్మాత విశ్వప్రసాద్ ఆనందం వ్యక్తంచేశారు. ఎంతో అద్భుతంగా దీన్ని తీర్చిదిద్దారని.. ఫ్రేమ్ టూ ఫ్రేమ్ చెక్ చేసినా బ్లర్ లేకుండా స్పష్టంగా కనిపిస్తున్నాయని సోషల్ మీడియా వేదికగా వీఎఫ్ఎక్స్ టీమ్‌ను ప్రశంసించారు. హనుమాన్‌తో భారీ విజయాన్ని అందుకున్న తేజ ఆ చిత్రం తర్వాత ఎన్ని ఆఫర్లు వచ్చినప్పటికీ మిరాయ్ కోసం వాటన్నిటినీ వదులుకున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో వచ్చిన ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ఈ హీరో సూపర్ యోధాగా కనిపించి మెప్పిస్తున్నారు. మహావీర్ లామా పాత్రలో మంచు మనోజ్ కూడా ఆకట్టుకుంటున్నారు. ఒక మామూలు కుర్రాడు తన ధర్మాన్ని తెలుసుకొని, ఒక పెద్ద ఆపదని ఆపడానికి ఎంత దూరం వెళ్తాడు తన తల్లి ఆశయం కోసం ఏం చేశాడు ఇతిహాసాల్లో ఉన్న సమాధానం కోసం అతడు చేసే ప్రయాణం ఏంటి అనే కథాంశంతో మిరాయ్ రూపొందింది.



# 'ఓజీ'లో నేహా శెట్టి

'డీజే టిల్లు' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన నటి నేహా శెట్టి. ఇప్పుడామె పవన్ కల్యాణ్ 'ఓజీ' సినిమాలో ఓ సర్‌ప్రైజ్‌లా కనువిందు చేయనున్నట్లు స్పష్టత ఇచ్చింది. సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా నటించారు. నేహా ఇందులో పవన్‌తో ప్రత్యేక గీతంలో ఆడిపాడటమే కాక ఆయనతో కొన్ని కీలక సన్నివేశాల్లో పాలు పంచుకున్నట్లు తెలిసింది. ఆమె చేసిన ఆ పాటతో పాటు ఈ చిత్ర ట్రైలర్ ఈ వారంలోనే విడుదల కానున్నాయి. ఇక ఈ చిత్రం కోసం పవన్ తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించినట్లు చిత్ర వర్గాలు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించాయి. ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది. నేహా ప్రస్తుతం తెలుగులో ఓ కొత్త చిత్రానికి సంతకం చేసింది. దాన్ని నవంబరులో ప్రకటించనున్నట్లు ఆమె తెలిపింది.

# మిరాయ్ విజయంతో మనోజ్ ఆనందం

## తల్లి ఆశీర్వాదం తీసుకుని సెలబ్రేషన్స్

తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం మిరాయ్ సినిమా విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సక్సెస్‌ను కుటుంబం, స్నేహితులతో కలిసి మనోజ్ పండగ చేసుకున్నారు. తన తల్లి పాదాలకు నమస్కారం చేసి ఎమోషనల్ అయ్యారు. ఈ విజయం చూసి ఆమె భావోద్వేగానికి గురయ్యారని.. అందరికంటే గర్వంగా ఫీలయ్యారని మనోజ్ వీడియో షేర్ చేశారు. తనను ఆదరించిన అభిమానులకు ధన్యవాదాలు చెప్పారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో కనిపించిన ఈ చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. అందులో మనోజ్ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. తనను నమ్మిన దర్శక నిర్మాతలకు రుణపడి ఉంటానన్నారు. ఈరోజు ఎంతో ఆనందంగా ఉంది. 12 ఏళ్ల తర్వాత సక్సెస్‌తో నా ఫోన్ మోగుతూనే ఉంది. అభినందనలు వస్తున్నప్పటికీ నాకు ఇదంతా కలలా ఉంది. ఈ కథలో నన్ను భాగం చేసినందుకు కార్తిక్‌కు జన్మంతా రుణపడి ఉంటాను. ఇంతకుముందు నేను ఎక్కడికి వెళ్లినా అన్నా సినిమా ఎప్పుడు తీస్తావు. కమ్‌బ్యాక్ ఎప్పుడు అని అందరూ అడిగేవారు. త్వరలోనే వస్తాను అని చెప్పేవాడిని. వాళ్లతో బయటకు ధైర్యంగా మాట్లాడినా.. లోపల తెలియని భయం ఉండేది. చాలా సినిమాలు చివరి నిమిషంలో క్యాన్సిల్ అయ్యాయి. అలాంటి టైమ్‌లో కార్తిక్ నన్ను నమ్మడం నా అదృష్టం. మీరు నన్ను మాత్రమే నిలబెట్టలేదు.. నాతో పాటు నా కుటుంబాన్ని కూడా నిలబెట్టారని దర్శకుడు కార్తిక్‌కు మంచు మనోజ్ థాంక్స్ చెప్పారు. నిర్మాత కూడా ఎంతో ధైర్యంగా దీన్ని పూర్తిచేశారు. మనోజ్‌తో సినిమా వద్దు అని ఆయనకు ఎంతోమంది చెప్పి ఉంటారు. అవేవీ వినకుండా విశ్వప్రసాద్ దీన్ని నిర్మించారు. మిరాయ్ వీఎఫ్ఎక్స్ టీమ్ తెలుగు సినిమా గర్వపడేలా చేసింది. ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ప్రతి ఇంట్లో నుంచి మనోజ్ గెలవాలి అని కోరుకున్న వారందరికీ పేరుపేరునా పాదాభివందనం. నామీద నమ్మకం పెట్టుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు. ఇకపై వరుస సినిమాలు చేస్తూ మీ అందరినీ అలరిస్తాను అని మనోజ్ తెలిపారు. ఇక మిరాయ్‌లో మహావీర్ లామా పాత్రలో మనోజ్ అందరినీ ఆకట్టుకుంటున్నారు.



# రెండో బేబీ కోసం ప్లాన్ చేస్తున్నాం

## రామ్‌చరణ్ ఉపాసన దంపతులు వెల్లడి



టాలీవుడ్‌లో రామ్‌చరణ్‌ఉపాసన దంపతులు ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటారు. మొదట్లో ఉపాసన పై విమర్శలు వచ్చినప్పటికీ, ఇప్పుడు ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ ఏడాది వీరిద్దరూ మెగా అభిమానులకు శుభవార్త అందించారు. పెళ్ళైన 11 ఏళ్ల తర్వాత ఉపాసన తల్లిగా మారారు. వీరికి పాప పుట్టగా, ఆ చిన్నారికి క్లీంకారా అని పేరు పెట్టారు. పాప పుట్టిన తర్వాత మెగా కుటుంబంలో ఆనందం అంబరాన్ని తాకింది. అయితే ఇప్పటి వరకు ఆ చిన్నారిని ప్రపంచానికి చూపించలేదు. అందుకే అభిమానులు కూడా ఆమెను చూడడానికి ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఉపాసన మాట్లాడుతూ.. రెండో సంతానం పై స్పందించారు.. మొదటి బిడ్డ విషయంలో ఆలస్యం చేశాం. నేను పదేళ్ల తర్వాత తల్లిని అయ్యాను. ఆ సమయంలో విమర్శలు, ఒత్తిడి ఎదురైనా పట్టించుకోలేదు. కానీ రెండో బిడ్డ విషయంలో అలాంటి తప్పు చేయదలచుకోవడం లేదు. సెకండ్ చైల్డ్ కోసం నేను సిద్ధంగా ఉన్నాను అని చెప్పింది. అంతే కాదు రామ్‌చరణ్‌ఉపాసన దంపతులు కుటుంబ విషయాలతో పాటు వ్యాపార రంగంలో కూడా ముందుకు సాగుతున్నారు. నిర్మాతగా ఇప్పటికే విజయాలు అందుకున్న రామ్‌చరణ్, ఇప్పుడు థియేటర్ బిజినెస్లోకి అడుగు పెట్టాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో లగ్జరీ మల్టీప్లెక్స్‌ను నిర్మించే ప్రాజెక్ట్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మల్టీప్లెక్స్ నిర్వహణ బాధ్యతలను ఉపాసన తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. అపోలో గ్రూప్స్‌తో కలిసి పలు విజయవంతమైన వ్యాపారాలు నడిపిన అనుభవం ఉన్నందున, ఈ ప్రాజెక్టు కూడా ఆమె చేతుల్లో విజయవంతమవుతుందని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కూడా ఈ నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికి మెగా అభిమానులకు ఇది నిజంగా గుడ్ న్యూస్.

# హోమ్‌బౌండ్ హీరో మంచి నటుడు

## హీరోయిన్ జాన్వీ కపూర్ కితాబు

జాన్వీకపూర్, ఇషాన్ ఖట్టర్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా హోమ్‌బౌండ్ విడుదలకు ముందే ఎన్నో ఘనతలు సొంతం చేసుకుందీ చిత్రం. తాజాగా దీని గురించి జాన్వీకపూర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇషాన్ ఖట్టర్‌పై ప్రశంసలు కురిపించారు. ఇది గొప్ప కథ. అందుకే ఈ చిత్రం నా కెరీర్‌కు ఉపయోగ పడుతుందా.. లేదా అని ఆలోచించకుండానే అంగీకరించాను. హోమ్‌బౌండ్ చిత్రీకరిస్తున్నప్పుడు ప్రతి సన్నివేశంపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. దీన్ని కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించినప్పుడు వచ్చిన ఆదరణ చూశాక ఆశ్చర్యపోయాం. ఇది ప్రేక్షకులపై ఎంత ప్రభావం చూపిందో మాకు అర్థమైంది. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ సినిమా చేసినందుకు ప్రేక్షకులు నన్ను ట్రోల్ చేస్తారేమో అనే భావన నాకెప్పుడూ రాలేదని జాన్వీకపూర్ అన్నారు. ఇక కేన్స్‌లో ఈ చిత్రానికి లభించిన స్పందన గురించి జాన్వీ మాట్లాడుతూ చిత్రబృందంలోని ప్రతిఒక్కరూ అంతర్జాతీయ గుర్తింపునకు అర్హులని అన్నారు. ఇందులో ప్రధానపాత్రలో నటించిన ఇషాన్ దేశంలోని ప్రతిభావంతులైన నటులలో ఒకడు. కానీ, అతడికి భారతీయ సినిమాలో ఇప్పటి వరకూ సరైన గుర్తింపు రాలేదు. కేన్స్ వేదికపై ఇషాన్‌ను చూడడం, ప్రపంచం అతడి నటనను ప్రశంసించడం చూసి నేనెంతో ఆనందించా. కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని అర్థమైందని చెప్పారు. ఇద్దరు స్నేహితుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందిన చిత్రం హోమ్‌బౌండ్. ప్రముఖ దర్శకుడు నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా కీలక పాత్రలు పోషించారు. కేన్స్‌లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా ఇటీవల ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్(ఐఎఫ్ఎఫ్ఎం)లో ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడిగా నీరజ్ ఘైవాన్ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు.



# రెండోపెళ్లికి సిద్ధంగా ఉన్న నటి ఎస్తేర్



ఇప్పటి వరకు ఒకే పెళ్లితో జీవితం గడిపేయాల్సిన సమాజపు ఆలోచన మారిపోయింది. విడాకులు తీసుకున్న, జీవిత భాగస్వామి లేకపోయినా, కొత్త జీవితం కోసం మరోసారి పెళ్లి చేసుకోవడమే ఇప్పుడు సాధారణంగా మారింది. సామాన్యులే కాదు, సినీ ప్రపంచంలోనూ ఈ ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. సింగర్ సునీత నుంచి అక్కినేని నాగచైతన్య వరకు చాలామంది రెండో పెళ్లి చేసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. అలాంటిది తాజాగా ఈ జాబితాలో చేరబోతున్నారంటూ వార్తల్లో నిలుస్తున్నారు హీరోయిన్ ఎస్తేర్ నొరోన్హా. కర్ణాటకలోని ఉడిపికి చెందిన ఎస్తేర్, ముంబైలో చదువుకున్నారు. బాలనటిగా కొంకణి సినిమాల్లో నటించి, ఆ తర్వాత 2012లో బారొమాస్ అనే హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా అడుగుపెట్టారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com